ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం

ఆగస్ట్ 31, 2008

# గాథా నిలయుడు గజముఖుడు

# హ్యాపీబర్త్‌డే

(2008 ఆగస్టు-31 నుంచి-
2008 సెప్టెంబర్ 6 వరకు)

ఎల్. రుత్విక
1సం॥, సెప్టెంబర్-1
కరుణ-వీరారెడ్డి
గట్టుసింగారం-ఖమ్మం

వి.శ్రావణి
6సం॥, ఆగస్టు-31
కోటమ్మ-వెంకటరంగయ్య
ప్రకాశం

ఎ.ఎల్.ఎన్. కార్తీక్
2సం॥, ఆగస్టు-2006
నాగలక్ష్మి-వెంకటేశ్వరరావు
విజయవాడ-కృష్ణా

వి.రంగమణికంఠ
3సం॥, ఆగస్టు-31
కోటమ్మ-వెంకటరంగయ్య
ప్రకాశం

కె. మధు
1సం॥, ఆగస్టు-31
రంగమ్మ-వీరేష్
కోసిగి-కర్నూలు

ఆర్. దివ్య
ఆగస్టు
యాదమ్మ-ఎల్లయ్య
చిన్నగొల్కొండ-రంగారెడ్డి

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం

# టెక్నాలజీ సాయంతో సామాజిక రుగ్మతలను పోగొట్టాలి

**మన అతిథి**

పేరు : అల్లం అప్పారావు
తల్లిదండ్రులు : లక్ష్మీభాగ్యం, గురుమూర్తి
స్వగ్రామం : విశాఖపట్నం
పుట్టిన తేదీ : 28-12-1949
విద్యార్హతలు : పిహెచ్.డి ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్
నిర్వహించిన బాధ్యతలు: ఎయు కంప్యూటర్ సెంటర్ విభాగాధిపతి కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, ఇంజనీరింగ్ హాస్టల్ చీఫ్ వార్డెన్, ఎయు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రస్తుతం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్
రచనలు : ఫ్లూయెన్సీ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనమిక్ పెర్‌స్పెక్టివ్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ బయో ఇన్ఫర్మేటిక్స్ డయాబెటిస్ మారిటస్, కాంపిటీషన్ బయాలజీ ఆఫ్ డయాబెటిస్ మారిటస్ తదితర ఆంగ్ల గ్రంథాలు, పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో కంప్యూటర్ సంబంధిత పరిశోధనా వ్యాసాలు
ఆకాంక్ష : భారతదేశాన్ని అత్యంత ప్రతిష్టాత్మక దేశంగా చూడటం
దేశం అన్ని రంగాల్లో సమున్నతంగా ఎదగడం
ఇష్టపడేది : దేశానికి మేలు చేసే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ
ఇష్టపడనిది : అపోహలు
ప్రభావం చూపించిన వ్యక్తులు : తల్లిదండ్రులు, ప్రొఫెసర్ బి.రామచంద్రరావు
అవార్డులు : ఫెలో సొసైటీ ఫర్ డిజైన్ అండ్ ప్రోసెస్ సైన్స్, రాష్ట్రప్రభుత్వం వారి బెస్ట్ టీచర్ అవార్డు, ఎయు బెస్ట్ రీసెర్చర్ అవార్డు, బెస్ట్ అకడమీషియన్ అవార్డు

**తొ**లినాళ్లలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనేవారు కాదు. కంప్యూటర్ సైన్స్ అనేవారు. అప్పట్లో కాలిక్యులేషన్స్‌కు ఉపయోగపడే పరికరంగానే కంప్యూటర్ ఉండేది. అక్కడ నుంచి హెచ్చుస్థాయిలో రోగ నిర్ధారణ, నివారణ, నిర్మూలన అంశాల వరకూ ఉపయోగించుకుంటున్నాం. ఈ మధ్యనున్న వివిధ అంశాలపై అధ్యయనం చేయడం చాలా గొప్ప విషయం. ఏదో చేశాననే కంటే ఎంతో కొంత చేయగలుగుతున్నానన్న సంతృప్తి. ఇదే విధంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజిస్టులందరూ విశేషంగా ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సామాజిక రుగ్మతలను పోగొట్టడానికి కృషి చేయాలి.

## ఈ సంచికలో....

టపా ... 2
ఆరోగ్యం ... 6
సీరియల్ ... 8
సినిమా ... 10
రుచి ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14

## ఇంకా...

విజ్ఞాన వీచిక... 3
క్రీడల్లో టెక్నాలజీ

మంచిపుస్తకం ... 4
రచయిత
మెదడుకు మేత

లాహిరి... లాహిరి ... 20
సలహాలు ... 22
మనసా... తెలుసా ... 23
కొత్త పుస్తకాలు ... 24

కథ 18
కథాగానం



## విజ్ఞానదాయకం... వైవిధ్యభరితం

స్నేహ శీర్షికలు వైవిధ్య భరితమైన, విజ్ఞానదాయకమైన సమాచారాన్ని అందిస్తున్నాయని చెప్పడానికి సంతోషిస్తున్నాం. 'లాహిరి లాహిరి'లోని విశేషాలు పాత పాటల అభిమానుల్ని దివానా గాళ్లుగా, పిచ్చోళ్ళుగా చేస్తున్నాయి. వరలక్ష్మి ద్వయం గురించి చెబుతూ కాసేపు తెలుగు అంతలోనే హిందీ ట్రాక్స్ గురించి కలగా పులగంగా రాయడం, 'దివానా పన్, పాగల్‌పన్'ల పరాకాష్టగాక మరేంటి! తన్మయత్వంలో తనకు తెలిసిందంతా చెప్పేయాలనే ఉబలాటంలో ఒక దాని వెంట ఒకటి దూసుకువచ్చాయి వైద్యగారి భావాలు. ఈ పాటల పిచ్చి వైద్యుని రచనలన్నింటినీ ఓ పుస్తక రూపంలో ప్రచురించి దాన్ని మురిపెంగా చదువుకుంటూ, దివానాగాళ్ళందర్నీ వారి లోకంలోనే వుండేట్టు చేయకూడదూ? జావో జావో జల్దీ వైద్యకో బులావో, హమ్ దీవానే హై హమ్‌నే ఔర్ దీవానా బనావో. 'రఫీ జ్ఞాపకాలు' బాగుంది. కడప సే ఏక్ పాగల్ దివానా తోట.

**చంద్రశేఖర రెడ్డి,**
**ప్రకాశ్‌నగర్, కడప.**

## నీళ్ల మీద కవర్ బావుంది

"సీసాల్లో నీళ్ళు గొంతు తడవని ఊళ్ళు" కవర్ స్టోరీలో నీళ్ల గురించి తెలియచేసిన అంశాలు చాలా ముఖ్యమైనవి. మొత్తం ప్రపంచంలో 71 శాతం నీరు 29 శాతం భూమి వుండగా ఆ నీటిలో 97 శాతం ఉప్పు నీరు. 3 శాతం మంచి నీరు. అందులో తాగునీరు రెండున్నర శాతం. నీరు నేడు వ్యాపార సరకుగా మారింది. నీటి కోసం ప్రజలు పడుతున్న బాధలు ఎక్కువే. నీటిని పరిష్కరించుకోవలసిన బాధ్యత అందరిది. 'కూరగాయల కొట్టు' కథ నేటి కార్పొరేట్ రంగానికి అద్దం పట్టింది. "వెజ్ ఫ్రెష్" పేరుతో కూరగాయలమ్మే కొట్లపై గుత్తాధిపత్యం కార్పొరేట్ రంగం ఆక్రమించుకోవడంతో చిన్న చితక వ్యాపారస్తులు, వారిపై ఆధారపడిన వారు జీవన ఉపాధి కోల్పోతారు. ఆకలి చావులు ఆత్మహత్యలు జరుగుతాయి. వీటన్నిటినీ ఆ కథలో చూచాయగా చూడగలిగాం.

**టి. శ్రీరామ్మూర్తి,**
**గాజువాక, విశాఖపట్నం.**

## వాస్తవానికి అద్దం పట్టిన కథ

ముఖచిత్ర వ్యాసం సీసాలో నీళ్ళు- గొంతు తడవని ఊళ్ళు చక్కగా ఉంది. అలాగే కూరగాయల కొట్టు కథలో కోటిపల్లి తారక రామారావు గారి కథ వాస్తవానికి అద్దం పట్టింది. ఇలాంటి కథలు చాలా వచ్చినా... అందులో పాత్రధారి రాములమ్మ లాంటి వారి ఆక్రోశాన్ని రచయిత వర్ణించిన తీరు హృద్యంగా ఉంది.

**బి. కిరణ్, విశాఖపట్నం.**

## ఈ వారం హైలెట్ అదే

ఆదివారం స్నేహ పుస్తకంలో ముఖచిత్రం సీసాల్లో నీళ్ళు! గొంతు తడవని ఊళ్ళు!!లో దోసిళ్లతో కొళాయి నుంచి నీరు తాగుతున్న దృశ్యం ఓ హైలెట్. నిరంతరం ప్రజలకోసం ఆరాటం ఈ చిత్రం ప్రచురణ వారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. హ్యాపీ బర్త్‌డేలో పిల్లల అందమైన చందమామ లాంటి ముఖాల్లోని నిండు వెలుగులను ఆహ్వానిద్దాం. ప్రతివారం మన అతిథితో ప్రముఖుల జీవితాల చరిత్ర పాఠకులకు గొప్ప వరం. చిత్రకూట్ చదివిన తరువాత అందమైన ప్రాచీన బురుజులు, కోటలు, ఆనాటి వెలుగులు మరవగలమా. సందేహాలు - సమాధానాలలో బి.వి. రాఘవులు గారు చెప్పిన వాస్తవాలు నేటి చరిత్ర తీపి గుర్తులు. బాల నేస్తాలు బంగారు కొండ. సముద్ర గర్భంలో జీవకాంతి గురించి చక్కగా వివరించారు. ఆగస్టు 17 ఆదివారం స్నేహలో అట్టమీది కథ శీర్షిక సీసాల్లో నీళ్ళు- గొంతు తడవని ఊళ్ళు బావుంది. నిజంగానే పట్టణాల్లో, గ్రామాల్లో మంచినీళ్లకు కరువై పోయింది. రోజు, ఒక్క బిందె నీళ్ల కోసం ఎన్నో మైళ్ల కొద్ది దూరం వెళ్ళి తీసుకురావాల్సిన పరిస్థితి వచ్చింది. పట్టణంలో వాటర్ ట్యాంక్‌లు ఉన్నా లేనట్టే. ఎందుకంటే మరమ్మతుల వల్ల కొన్ని లక్షల గ్యాలన్ల మంచి నీరు వృధాగా పోతుంది. ట్యాంకు పైపు లీకు అయ్యి రోడ్డుపై పారుతున్న మంచినీరు డ్రైనేజీలోకి వెళ్ళి నేల బావిలోకి చేరుతున్నాయి. సకాలంలో మరమ్మతులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా మంచినీటి, సరఫరాకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దీని మీద శ్రద్ధ చూపించాలి. నీటి కాలుష్యం వల్ల ప్రజలు, అనారోగ్యంతో బలై పోతున్నారు. ఈ విషయాలన్నీ తెలిపేటటువంటి అట్టమీది కథ అందించిన ఎం. కోటేశ్వరరావు గార్కి కృతజ్ఞతలు. ఆరోగ్యం విషయంలో డా॥ బి.బి.పి. రాజుగారు, చెవిలో సోకే 'ఓటో మైకోసిస్' వ్యాధి గురించి చక్కగా తెలియజేశారు. అలాగే ఈ వారం కథ 'కూరగాయల కొట్టు' చాలా బాగుంది. ఈ కథ అందించిన కె.టి. రామారావు గార్కి అభినందనలు.

**అనుపోజు**
**సత్యనాగరాజు, రాజీవ్‌నగర్ కాలనీ,**
**విజయనగరం.**

## విజ్ఞాన వీచిక ఆకట్టుకుంది

ఆగస్టు 17 నాటి స్నేహ అట్టమీది కథగా అందించిన కోటేశ్వరరావు గారి రచన ద్వారా నీళ్లులేని ఊళ్లు ఎంతగా కటకటలాడుతున్నాయో తెలిసింది. కె.టి. రామారావు గారి కథ "కూరగాయల కొట్టు" బావుంది. భూమిపై గల జలచరాలలో ఒక్క న్యూజిలాండ్ గోవర్మ్ (ఆరాక్నో కాంపాల్యుమినోసా) అనే జీవి మాత్రమే జీవ కాంతిని, ఉత్పత్తి చేస్తుందనేటటువంటి విశేషాలతో వెంకట్రావు గారి 'విజ్ఞాన వీచిక' ఆకట్టుకుంది. 'ట్విన్‌బర్గ్'లో జరిగిన కవలల పోటీ విశేషాలు చదవాం. అనసూయాజీ, గుప్త గోదావరి, స్ఫటికశిల, జానకీకుండ్, వంటి ప్రాంత విశేషాలతో 'చూద్దామా' శీర్షికలో 'చిత్రకూట్ సందర్శించ గలిగాం. 'ఓ మంచి పుస్తకం' శీర్షిక ద్వారా ముఖ్యమైన పుస్తకాల గురించి కూలంకషమైన సమీక్ష ద్వారా పరిచయం చేసుకోగలుగుతున్నాం. "విలువలతో కూడిన జీవితాన్ని ఆహ్వానించాలనీ, పూర్తి శక్తిని ప్రణాళికా బద్ధంగా వినియోగిస్తూ నిరంతర కృషి చేస్తేనే అద్భుత విజయాలు వర్ధిల్లుతాయనీ చెప్తున్న మన అతిథి వి. ఎమ్.పి. పాండే గారి మనోగతం అమూల్యమైనది.

**- నేమాన సుభాష్‌చంద్రబోస్,**

**ఇలిసిపురం జంక్షన్, శ్రీకాకుళం టౌన్**

## నీటి నిజాలు సూటిగా చెప్పారు

ఆగస్టు 17 స్నేహ సంచికలో అతిథి విజయ్ మనోహర్ జీవితం నిజంగా విజయానికి సూచనగా ఉంది. భారతీయ శాస్త్రవేత్తలు, సాహితీ వేత్తలు, ఎన్నో విజయాలను సాధిం చిన యువకులు స్వాతంత్ర్యోద్యమ నాయకుల స్ఫూర్తితో విజయాలతో కూడిన జీవితాన్ని జీవించాలంటూ అందించిన సమాచారం అద్భుతం. మనం నిజంగా అలాంటి జీవితాన్ని ఆహ్వానిద్దాం. ఓ మంచి పుస్తకంలో సమకాలిన రాజకీయ, సామాజిక సమస్యల అవగాహనకు, మంచి మార్గదర్శి. ప్రశ్నలు వేయడం ఒక ఎత్తైతే సమాధానాలు చెప్పడం మరో ఎత్తు. సందేహానికి తగిన సమాధానాలు వి.బి. రాఘవులుగారు చాలా చక్కగా తెలియజేశారు. ఆయన ప్రశ్నల సమాధానాలు పుస్తక రూపంలో తీసుకు రావడం గొప్ప విశేషం. అట్టమీది కథ సీసాల్లో నీళ్ళు గొంతు తడవని ఊళ్ళు బావుంది. పంచభూతాలపై ఎవరికీ గుత్త హక్కు లేదు. అలాంటి వాటిలో నీళ్ళు ఒకటన్న చేదు నిజాన్ని మా కళ్ళముందుంచారు. సీసా నీటిని వ్యతిరేకిస్తూ అనేక మంది మహిళలు డిమాండ్ చేసినా... సంపన్న దేశాలతో పాటు మన దేశం కూడా చేయి కలిపి జనం సొమ్ము నీటి పాలు చేసింది. నీటి నిజాలు చాలా సూటిగా తెలియజేశారు.

**కర్రా వరప్రసాద్,**
**యలమర్రు, కంద్రిక,**
**కృష్ణాజిల్లా.**




ENTERED

డా॥ కాకర్లమూడి విజయ్

**2008 ఒలింపిక్స్ పూర్తయ్యాయి. అనుకున్నట్టుగానే చైనా అత్యధిక పతకాలతో అగ్రస్థానంలో ఉండి క్రీడా ప్రపంచాన్ని తనవైపుకు మరల్చుకుంది. ప్రారంభ, ముగింపు సంబరాలతో మొత్తం ప్రపంచాన్ని ఆశ్చర్యపరచింది. ఈసారి ఒలింపిక్స్‌లో క్రీడా స్ఫూర్తితోపాటు ఆధునిక టెక్నాలజీ కూడా ప్రముఖ పాత్ర పోషించింది. మరి ఆ విశేషాలేంటో ఈ వారం చూద్దామా...!**

# క్రీడల్లో టెక్నాలజీ

**ఒ**లింపిక్స్ జ్యోతిని ప్రసిద్ధ కంప్యూటర్లు తయారు చేసే కంపెనీ "లెనోవో" తయారు చేసింది. ఎండా, వానా, గాలీ, పీడనం, ఎత్తు వగైరా అవరోధాలన్నిట్లోనూ ప్రజ్వలించడమే గాక ఎక్కువ పొగ, మసి రాకుండా రూపొందించబడింది. ఈ క్రీడా పోటీలు క్రీడాకారుల మధ్యే తప్ప వారు ఉపయోగించే వస్తువుల (బూట్లు, ట్రాక్ సూట్లు, బ్యాట్ల వంటివి) మధ్య కాదని ఒలింపిక్ కమిటీ నిర్వచించినా, నిర్బంధాలు విధించినా విజ్ఞాన అభివృద్ధి సహాయం తీసుకోనివ్వకుండా మాత్రం ఆపలేకపోయింది. డార్ట్‌ఫిష్ అనే సాఫ్ట్‌వేర్ పాకేజ్ అమెరికన్ క్రీడాకారులకు ఒక గొప్ప వరం లాంటిది. క్రీడాకారుడు పాల్గొనే క్రీడల శిక్షణను అది రికార్డు చేసి, తప్పొప్పులను పునశ్చరణ చేసుకునే వీలు కల్పిస్తుంది. ఇటువంటి ఇతర ఉపయోగకర టెక్నాలజీలు చాలా వాడకంలో ఉన్నా వాటి గురించి వివరాలు బహిర్గత పరచడానికి ఎవరూ ఇష్టపడటం లేదు- రహస్యాలు ఇతరులు తెలుసుకుంటారనే భయంతో.

సైక్లింగ్‌లో బైక్‌లు ఈ సారి విశేషం కావు- వాటి చక్రాలే విశేషం. ఏరో స్పేస్ ఇంజనీర్ పాల్ ల్యుకి తేలికైన, దృఢమైన చక్రాలు రూపొందించే బాధ్యతను అప్పగించారు. పాల్ ప్రకారం సైకిల్, విమానం ఒక విషయంలో ఒకటే. తేలికగాను, దృఢంగానూ ఉండటం వల్ల పనితనం, సామర్థ్యం మెరుగౌతుంది.

అతను తయారు చేసిన చక్రంలో 'పుల్లలు' (సువ్వలు) ఏరో డైనమిక్‌గా ఉండటానికి మధ్యలో ఉబ్బెత్తుగానూ, అంచుల్లో కొసగానూ ఉంటాయి. అతను మనుషుల్లేకుండా ప్రయోగించే విమానాల తయారీలో వాడే బోరాన్ ఉన్న కాంపోజిట్ పదార్థంతో 'పుల్లల్ని' తయారు చేశాడు! ఈ పదార్థం అదే బరువున్న కార్బన్ ఫైబర్ కంటే మూడు రెట్లు దృఢమైనది.

ఒలింపిక్స్ ముగిసిన తర్వాత మార్కెట్లో లభ్యమయ్యే ఈ బిటి-1 'చక్రాల' జత ధర 15000 డాలర్లపై మాటే (సుమారు ఆరు లక్షల అరవై వేల రూపాయలు)!

ఆధునిక విల్లులు కూడా టెక్నాలజీ సాయంతో మరింత ఆధునికమయ్యాయి. ఈ విల్లులు పదే పదే వాడవలసిన క్రీడా సామాగ్రి. కాబట్టి ఎటువంటి పరిస్థితులలోనైనా అవి ఒకేలా ఉండాలి. ఒక రకమైన వాతావరణంలో శిక్షణ పొందిన విలుకాడు బీజింగ్ వంటి అధిక తేమ వాతావరణంలో విల్లుల లక్షణాలు మారితే సామర్థ్యంలో, ఫలితాలలో దెబ్బతినవచ్చు. దృఢత్వం, తేలిక ఎటువంటి ఉష్ణోగ్రతా మార్పులకీ లొంగని తత్వం వీటి లక్షణం. 900సి× అనే విల్లులు ఫైబర్‌గ్లాస్ కోటింగ్ బదులు కృత్రిమ పాలిమర్ కోటింగ్, లోపల కార్బన్ ఫైబర్లతో తయారయ్యాయి.

లాన్ టెన్నిస్, క్లే కోర్ట్ టెన్నిస్ తెలుసు. కానీ బీజింగ్‌లో జరిగిన దానిని నానో టెన్నిస్ అనాలేమో! టెన్నిస్ రాకెట్ల తయారీదారులైన డన్‌లప్, హెడ్ సంస్థలు ఒక అద్భుత పదార్థాన్ని వాడాయి. అంతరిక్ష సంస్థ నాసా తన స్టార్ డస్ట్ మిషన్‌లో ఉల్కల పదార్థాన్ని సేకరించడానికి ఒక ప్రత్యేకమైన తక్కువ సాంద్రత గల ఏరోజెల్‌ని వాడింది. అదే పదార్థాన్ని టెన్నిస్ రాకెట్ల తయారీలో వాడారు! మరో మాట- టెన్నిస్ బంతి గీత లోపల పడిందా, బయటపడిందా అని తెలుసుకోవడానికి హాక్-ఐ అనే కంప్యూటర్ వ్యవస్థనీ వాడారు. దాదాపు 10 కెమెరాలతో బంతి గమనాన్ని చిత్రీకరించి, దాని వేగాన్ని, దారిని లెక్కగట్టి బంతి ఎక్కడ నేలను తాకుతుందో అంచనా వేస్తుంది. ఇది గత వింబుల్డన్‌లో వాడకంలో ఉంది.

నైక్ కంపెనీ హైటెక్ బూట్లు రన్నర్లకి కొత్త శక్తిన్ని ఇచ్చాయనే చెప్పాలి. నాసా మార్స్ పైకి స్పిరిట్, ఆపర్చునిటీ అనే రోవర్లని పంపింది. వాటిని మార్స్ పైన దింపేటప్పుడు మెత్తగా ఉండటానికి ప్రత్యేకమైన ఎయిర్‌బ్యాగ్‌లను ఉపయోగించింది. ఆ బ్యాగ్‌లలోని పదార్థంతోనే నైక్ తన ట్రాక్ షూలను రూపొందించింది. వెక్ట్రాన్ అనే ఆ పదార్థంతో చేసిన 116 పోగులను నేసి బూట్లు చేసింది.

వాలీబాల్ ఆట మాత్రం క్రీడాకారుడి నైపుణ్యం పైన ఆధారపడి ఉంటుందని అనుకోవడం సహజం. కానీ మికాసా అనే క్రీడా సామాగ్రి తయారు చేసే సంస్థ అలా అనుకోవడం లేదు. ఆ సంస్థ నీరు పీల్చుకోని పదార్థంతో బంతుల్ని చేసింది. ఆరు బయట ఆడటానికి ఉపయోగపడే ఈ బంతికి ప్రత్యేకమైన పద్ధతిలో 'కుట్లు' కూడా ఉంటాయి. వీటి వల్ల ఇసుక బంతిపై నిలబడదు!

ఇండోర్‌లో ఆడే బంతికి కొత్త స్వరూపాన్నిచ్చారు. గోల్ఫ్ బంతిలాగా చిన్న చిన్న 'సొట్ట'లతో ఈ బంతి ఉంటుంది. ఈ మార్పు వల్ల అటు ఆటగాడి చేతిలో బంతి బాగా కంట్రోల్ అవ్వడమే కాక గాలి నిరోధాన్ని అవలీలగా అధిగమిస్తుందట.

మన ఆటగాళ్లు మన జాతీయ క్రీడను ఈసారి ఒలిపింక్స్‌లో ప్రదర్శించలేక పోయారు గానీ, అక్కడ హాకీ కోసం హైటెక్ మార్పులే జరిగాయి. హాకీ కృత్రిమ పచ్చికపై ఆడతారు- బంతి బాగా వెళ్లడం కోసం ఆ గడ్డిని దాదాపు 15000 గాలన్ల నీటితో తడుపుతారు. బీజింగ్ కోసం కొత్తగా రూపొందించిన టర్ఫ్ దాదాపు 40 శాతం నీటిని ఆదా చేస్తుంది. పైగా రీసైకిల్ చేసిన ఎలాస్టిక్ పదార్థాల వలన ఆటగాళ్లకి గాయాలు తగ్గుతాయి. బంతి అటూ ఇటూ కాకుండా తిన్నగా పోవడానికి సాధారణంగా ఉండి 55,000/- కుట్లు /చ మీటరు బదులు చదరపు మీటరుకు 75000 కుట్లు వాడారు. ఈ మార్పులన్నింటివల్ల బూట్లు కూడా మార్చవలసి వచ్చింది. నైక్ కంపెనీ ఈ తరహా గడ్డి మీద ఆడటం కోసం 20 రకాల డిజైన్లను పరీక్షించింది! ఇవే కాక మరెన్నో విభాగాలలో టెక్నాలజీ తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది.

❋

తెర

> సిద్ధాంత తాత్విక పరమైన రచనలు కూడా ఇందులో వున్నాయి. సాహిత్యాన్ని కేవలం సందర్భ దృష్టితో గాక సారాన్ని బట్టి చూసే పద్ధతి పెరగాలని చెప్పే వ్యాసం ఒకటి. అనాదిగా సాగుతున్న వస్తురూపాల అంతస్సంబంధాన్ని విశ్లేషించేది మరొకటి. సంస్కృతి-కళ-సౌందర్యం,మార్క్సిజం-సాహిత్య ధోరణులు వంటి నిరంతర చర్చనీయాలు కూడా దీనిలో చూడగలుగుతాము. ఇందులో ఆయన చెప్పిన అన్ని విషయాలతో ఏకీభవించలేక పోయినా ఆ క్రమానుగత పరిశీలనా పద్ధతి ఎంతో విలువైన సమాచారాన్ని ఇస్తుంది. అస్తిత్వానికి సంబంధించి ఎ రిక్ ఫ్రామ్‌పైనా వ్యాసం వుంది.




# రచయిత మెదడుకు మేత

తెలుగులో సామాజిక దృష్టి గల కవులు రచయితల సంఖ్య చాలా ఎక్కువగానే వుంటుంది. ఎక్కడ కవి సమ్మేళనం లేదా జన కవనం వంటిది జరిగినా వందల మంది పాల్గొనడం జరుగుతోంది. సామాజిక దృశ్యాన్ని ప్రతిబింబించే కథలు కూడా బాగానే వస్తున్నాయి. నవలల విషయంలో సహజంగానే అంత పురోగమనం లేదు గాని అడపా దడపా మంచి నవలలు వస్తూనే వున్నాయి. మొత్తంపైన తెలుగు సాహిత్య గమనం ప్రగతి దిశలోనే వుందనడం నిస్సందేహమే. అయితే అంతులేని ఈ విస్తార సాహిత్య సృజనను విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే అనేక విధాల అసంతృప్తి కలుగుతుంది. ఇతివృత్తాల ఎంపికలో గాని, రచనా శిల్పంలో గాని, అభివ్యక్తిలో గాని అవగాహన లోపం స్పష్టంగా కనిపిస్తుంది. అధ్యయన లోపం కళ్లకు కడుతుంది. ఇవేవీ కేంద్రీకరిస్తే అందుకోలేని విషయాలు కాదు. గతంలో కెవిరమణారెడ్డి,రాచమల్లు రామచంద్రారెడ్డి వంటి వారు ఎప్పటికప్పుడు విలువైన విమర్శలతో సాహిత్యకారుల మెదళ్లకు పని పెట్టేవారు. ఇప్పుడు సాహిత్య విస్తరణతో పోలిస్తే విమర్శ విస్తరణ పరిమితమై పోవడం ఒక లోపంగా వెన్నాడుతున్నది. ఆ లోటును తీరుస్తున్న అతి కొద్ది మంది అధ్యయనశీల విమర్శకులలో పాపినేని శివశంకర్ ఒకరు.

'సాహిత్యం మౌలిక భావనలు' అన్న అంశంపై సిద్ధాంత పత్రం ప్రకటించిన శివశంకర్ స్వయానా కథకుడు కవి. దాదాపు ఇరవై ఏళ్లుగా కథా సంపుటాల సంపాదకత్వం నెరుపుతున్న కార్యశీలి. అదే రీతిలో కవిత్వాన్ని ప్రత్యేకంగా పరిశీలించే నిబద్ధ విమర్శకుడు. ఆయన సాహిత్య తాత్విక రంగాలపై రాసిన వ్యాసాలు 'చేసిన ప్రసంగాల సంకలనం' 'నిశాంత' పేరుతో విశాలాంధ్ర వారు ప్రచురించారు. సామాజిక దృష్టి రచనాసక్తివుండి అవగాహన పెంచుకోగోరే వారికి ఈ పుస్తకం బాగా ఉపయోగపడుతుంది. వివిధ కోణాల నుంచి సాహిత్యాన్ని అర్థంచేసుకునే అవకాశం కలిగిస్తుంది.

140 పేజీల ఈ పుస్తకంలో 18 వ్యాసాలున్నాయి.విషయ పరంగా అన్నీ విలువైనవే.

'ప్రపంచీకరణ ప్రతిఘటన' అన్న తొలి వ్యాసంలో శివశంకర్ దానికి సంబంధించిన నిర్వచనాన్ని, వివిధ పార్శ్వాలనూ పరిచయం చేశారు. అంతర్జాతీయకరణ, సరళీకరణ, విశ్వీకరణ, పాశ్చాత్యీకరణ, ప్రదేశ రాహిత్యం అనేవి దాని అయిదు భాగాలని పేర్కొన్నారు. దీనికి కొన్ని ఉదాహరణలు, సాంకేతిక నిర్వచనాలు కూడా పొందు పర్చారు. తర్వాత భాగంలో సరికొత్త సాంకేతిక మార్పుల సామాజిక ప్రభావాన్ని పరిశీలించే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో మానవీయత మరుగై పోతున్న వైనాన్ని చెప్పారు. జీవన శైలిలో మార్పు, కార్పొరేట్ మానవుడు, తిండితిప్పలు మార్పులు అన్నిటినీ పరామర్శించారు. పర్యావరణంపై దాని ప్రభావాన్ని ప్రత్యేకంగా రాశారు.తన సూత్రీకరణలకు తగిన కవితా చరణాలను జోడించారు. ప్రపంచీకరణలో సరుకుల పెట్టుబడుల నిర్నిబంధ విహారాన్ని కూడా జోడించి వుంటే ఈ అధ్యయనం మరింత సమగ్రమై వుండేది.

'నిసర్గ సాహిత్యం' అన్న రెండవ వ్యాసంలో ప్రతిభావంతులైన కవులు, రచయితలు తమ తమ ప్రత్యేకతలతో రచనలు సాగించే క్రమాన్ని సోదాహరణంగా విశ్లేషించారు. అయితే ఒక స్థాయికి చేరేప్పటికి విలక్షణమైన చట్రం రూపొందించుకోగలుగుతారు. తర్వాత దానిలో ఇరుక్కుపోవడం వల్ల మొదట్లోని నిసర్గత్వం( సహజత్వం) పోగొట్టుకుంటారు. కేవలం కొద్దిమంది కవులు మాత్రమే దీన్ని ఛేదించి తమ చట్రాన్ని తామే బద్దలు కొట్టుకుంటారు అని చక్కని వివరణ నిస్తారు.

ఈ పుస్తకంలోని వ్యాసాలలో ధిక్కారం ఒక సంకేతం అన్నది చాలా ముఖ్యమైన రచన. ప్రాచీన సాహిత్యంలోని శివ కవుల నుంచి వేమన వరకూ ఇప్పటి విప్లవ కవుల వరకూ ధిక్కార సాహిత్యం ప్రజా సాహిత్యంలో ఎలా వరవడి పెట్టిందో చారిత్రికంగా విశదపర్చారు. బండెనక బండి గట్టి పాటలోనూ, వందేమాతరం అన్న చెరబండరాజు గీతంలోనూ దాని ఛాయలు పరికించారు. నారా, వరవరరావు కవితల్లో రాజ్య ధిక్కారాన్ని ప్రస్తావించిన తర్వాత ప్రపంచీకరణ శకంలోకి వచ్చారు. సారా వ్యతిరేకోద్యమం, విద్యుచ్ఛక్తి వుద్యమం, గుజరాత్ మారణహోమం వంటి సందర్భాల్లో వేనోళ్ల ప్రతిధ్వనించిన ప్రతిఘటనా సాహిత్యాన్ని పరామర్శించారు. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద ఆధిపత్యంపై ధిక్కార కవిత్వంతో ముగించారు. 'మనిషి బహువచనం' అన్న వ్యాసం శీర్షికే ఒక గొప్ప భావనను అందిస్తుంది. వాస్తవంగా ఆ శీర్షిక నుంచి ఆయన ప్రపంచీకరణ యుగంలో అమానవీకరణను చిత్రించే కవితల వరకూ ఉదహరించారు.శివారెడ్డి, గోపి,సినారె వంటి వారి కవితలనుంచి మట్టికీ మనిషికీ మధ్యన

వుండే సంబంధాన్ని మనోజ్ఞంగా చిత్రించిన చరణాలను పొందుపర్చారు. ఆకులో ఆకునై అన్న కృష్ణశాస్త్రి కవితను పలాయనంగా గాక ప్రకృతితో మమేకతగా చూడాలా అన్న ప్రశ్నను సంధించారు. అమానవీకరణను చెప్పిన అఫ్సర్, కొండేపూడి నిర్మల, వసీరా, ఆశారాజు, నాళేశ్వరం శంకరంలను పేర్కొన్న తర్వాత మళ్లీ 'నే మనిషిని తాకినప్పుడు/ మృదులగంభీరమైన ప్రకృతిని తాకినట్టు/ సమస్త ప్రకృతిసంపదను తాకినట్టు/ నే మనిషిని తాకినప్పుడు ఒక ఆత్మీయత, ఒక ఆదరణ/ ఒక గాఢానుబంధ తంత్రీనాదం' అంటున్న శివారెడ్డి కవితలోని మానవీయ స్పర్శతో ముగించారు.

'వేయి రేకుల్లో కవిత్వం వికసించిన కాలం' అన్న వ్యాసంలో ఆయన వివిధ దశల్లో తెలుగు కవితా పరిణామ క్రమాన్ని చారిత్రికంగా పరిశీలించారు. సాధారణీకరణ, అనుభూతి, అస్తిత్వం, స్త్రీవాదం, కులస్పృహ వగైరా కోణాల కవితలను పరామర్శ ఇచ్చారు. చివరగా కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి అంతర్గత జ్ఞాపికా చట్రం,బాహ్య జ్ఞాపికా చట్రం అన్నవి రెండూ ఉపయోగించాలని సూచించారు. సమస్త మానవ జాతి కవిత్వం నిజం కావల్సిన మనిషి స్వప్నం. అది మనిషి జీవితావసరం అంటూ ముగించారు. పనీ పాటా అన్నట్టుగా మానవ జీవితంలో పాటలకూ పదాలకూ వున్న ప్రాధాన్యతను గమనిస్తే ఈ మాటల్లోని ఔచిత్యం అర్థమవుతుంది.రైతు కవిత్వం అన్న వ్యాసం కూడా ఇలాగే వివిధ చారిత్రిక దశల్లో వారిపై వచ్చిన కవితలు పాటల పూర్వాపరాలు చెప్పారు. ఆ విధంగా ఇది చాలా ఉపయోగకరమైంది.

ఇలాటివి కాక సిద్ధాంత తాత్విక పరమైన రచనలు కూడా ఇందులో వున్నాయి. సాహిత్యాన్ని కేవలం సందర్భ దృష్టితో గాక సారాన్ని బట్టి చూసే పద్ధతి పెరగాలని చెప్పేది వాటిలో ఒకటి. అనాదిగా సాగుతున్న వస్తురూపాల అంతఃస్సంబంధాన్ని విశ్లేషించేది మరొకటి. సంస్కృతి-కళ-సౌందర్యం,మార్క్సిజం-సాహిత్య ధోరణులు వంటి నిరంతర చర్చనీయాలు కూడా దీనిలో చూడగలుగుతాము. ఇందులో ఆయన చెప్పిన అన్ని విషయాలతో ఏకీభవించలేక పోయినా ఆ క్రమానుగత పరిశీలనా పద్ధతి ఎంతో విలువైన సమాచారాన్ని ఇస్తుంది. అస్తిత్వానికి సంబంధించి ఎ రిక్ ఫ్రామ్‌పైనా వ్యాసం వుంది.

శివశంకర్ కథలపై కూడా విస్తారంగా రాశారు. 'తెలుగు కథ- నిన్న నేడు' అన్నది వాటిలో సమగ్రమైంది. ఇక 'కథా సౌందర్యం' అన్న వ్యాసంలో కథారచనలోని వివిధ దశలనూ ఎత్తుగడలనూ ఆయా రచయితల పోకడలను పరామర్శిస్తూ విలువైన పాఠాలందించారు. స్వేచ్ఛా కథా వ్యవస్థ అన్న వ్యాసంలో ఆయన గొప్ప కథ లక్షణాలేమిటని చర్చించారు. గొప్ప రచయిత ఎప్పుడూ సగం రచయిత అని మిగతా సగం పాఠకుడే భర్తీ చేస్తాడని సూత్రీకరించారు.మానవ జీవితం ఎలా వుండాలి? ఎలా వుంది ? అనే రెండింటి మధ్య వైరుధ్యాన్ని పరిష్కరించే క్రమంలోనే గొప్ప కథ పుడుతుందన్నారు. మట్టిమీద కథా రచయితల కాలి గుర్తులు, దక్షిణతీరాంధ్ర కథ ఆయా అంశాలను పరామర్శించాయి. మిగిలిన వాటితో పాటు తెలుగు నాటకంపై వ్యాసం అదనం.

శివశంకర్‌లో నిశిత పరిశీలనా నిర్మాణాత్మక విమర్శ పోటీపడుతుంటాయి.కొన్ని పట్టుల్లో ఆయన శుద్ధ సౌందర్య వాది అనిపిస్తుంటాడు కూడా. మౌలిక అధ్యయనానికి అమూల్యమైన వనరుగా నిల్చిపోగల వ్యాసాలివి.ధర కొంచెం ఎక్కువైనా సాహిత్య జీవులు వీటిని చదివితే లోతుపాతులు తెలుస్తాయి. ముఖ్యంగా సరికొత్త వారికి ఇవి తప్పని సరి.

**నిశాంత**

**సాహిత్య, తాత్విక వ్యాసాలు**

**డా॥ పాపినేని శివశంకర్**

**వెల: 70/-, పేజీలు: 140**

**ప్రతులకు:**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.**

**అన్ని బ్రాంచీలు.**

❋











కథా నిలయం
శ్రీకాకుళం



**డాక్టర వి.చంద్రమోహన్,**
యూరాలజిస్ట్, ఆంథ్రాలజిస్ట్,
మెడిసిటీ హాస్పిటల్స్,
హైదరాబాద్. ఫోన్ : 9848991666

# మూత్ర విసర్జన సమయంలో మంటగా వుంటోందా!

**మన శరీరంలో తయారైన మలిన పదార్థాలు మూత్రం ద్వారా బయటికెళ్తాయి. ఇది సహజంగా జరిగే ప్రక్రియ. మూత్రపిండాల్లో తయారైన మూత్రం మూత్రనాళం ద్వారా మూత్రాశయంలో నుంచి బయటికొస్తుంది. అయితే ఒక్కోసారి మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్ వస్తుంటుంది. దానిని గుర్తించి వెంటనే చికిత్స చేయించుకోవాలి. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు అస్సలు అజాగ్రత్త చేయకూడదు. ఈ వారం మూత్రాశయంలో కలిగే ఇన్‌ఫెక్షన్ గురించి తెలుసుకుందామా....**

**మూ**త్రాశయ ఇన్‌ఫెక్షన్ అంటే మూత్రంలో చీము కణాలే కాదు. మూత్రంలో బ్యాక్టీరియా వుండి, అది పెరిగితేనే ఇన్‌ఫెక్షన్ వచ్చినట్లు. ఇన్‌ఫెక్షన్ లేకుండానే చీము కణాలుంటాయి. మూత్రాశయంలో రాళ్లున్నా, క్షయ వ్యాధి వున్నా, అన్యపదార్థాలున్నా చీముకణాలు వస్తాయి. ఇలాంటి వాటిని ఇన్‌ఫెక్షన్ అనరు.

సాధారణంగా మధ్య వయసు మహిళల్లో, వృద్ధుల్లో మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్ సమస్యలు కనిపిస్తాయి. దీనికి ప్రధాన కారణం మధుమేహం. ఇది కాకుండా వయసు పైబడిన పురుషుల్లో ప్రొస్టేట్ గ్రంథి పెరిగి మూత్రం సరిగా బయటికి రాక, నిల్వ వుండి ఇన్‌ఫెక్షన్ వస్తుంది. 45-50 ఏళ్ల మహిళల్లో రుతుక్రమం ఆగిన తర్వాత ఈస్ట్రోజెన్ హార్మన్ తగ్గి జననాంగం దగ్గర పొడితనం పెరుగుతుంది. దీంతో ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఎక్కువుంటాయి. యూరిన్ ఇన్‌ఫెక్షన్ పెద్ద వారిలోనే కాకుండా చిన్న పిల్లల్లోనూ వస్తుంది. దీనికి కారణం పుట్టుకతో మూత్రపిండాలు, మూత్రాశయం, మూత్రనాళం అభివృద్ధిలో లోపం వుండడమే. సాధారణంగా పిల్లల్లో మొదటి 13 ఏళ్లలో ఈ ఇన్‌ఫెక్షన్ అసలు వుండకూడదు.

**మహిళల్లో ...**

మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ మధ్యవయసులోని మహిళల్లో ఎక్కువగా వస్తుంది. దీనికి ప్రధాన కారణం వెజైనల్ కొలనైజేషన్ ఆఫ్ బ్యాక్టీరియా. మూత్ర విసర్జన తర్వాత జననాంగాన్ని శుభ్రం చేసుకునే సమయంలో నీటిలో ఇ కొలై బ్యాక్టీరియా వుంటుంది. శుభ్రపరుచుకునే సమయంలో జననాంగం ద్వారా ఇది లోపలికి ప్రవేశిస్తుంది. కానీ, శరీర రోగనిరోధక శక్తి వల్ల జననాంగంపైనున్న మ్యూకోసా దీన్ని చంపేస్తుంది. ఇలా బ్యాక్టీరియా చనిపోకపోతే వాటి సంఖ్య రెట్టింపై క్రమంగా వృద్ధి చెందుతుంది. దీంతో వైట్‌డిశ్చార్జ్ అవ్వడానికి అవకాశముంటుంది. అంతేకాక ఈ బ్యాక్టీరియా మెల్లగా మూత్రనాళం నుంచి మూత్రాశయానికి చేరుకుంటుంది. జననాంగాల పరిశుభ్రత లోపించడం, ఎక్కువ మందితో లైంగిక సంబంధాలు కలిగి వుండడం వల్ల మహిళల్లో మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ వస్తుంది. చిన్న వయసులో హిస్టరెక్టమీ చేసుకున్న వారిలో మూత్రనాళం మూసుకుపోయి ఇన్‌ఫెక్షన్ వస్తుంది. ఇలాంటి వారిలో మూత్రనాళం వెడల్పు చేసి సాఫీగా మూత్రం వచ్చేటట్లు చేస్తారు.

బ్యాక్టీరియా మూత్రాశయంలోకి వెళ్లినప్పుడు సిస్టైస్‌తో బాధపడతారు. అంటే మూత్రాశయంలోని పొర ఇన్‌ఫెక్షన్‌కు గురై, మంట పుట్టడం, తరచుగా మూత్ర విసర్జనకెళ్లడం, విసర్జన తర్వాత మూత్రం మిగిలుందనిపించడం, పొత్తి కడుపులో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీన్ని సింప్టమాటిక్ యూరిన్ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ అంటారు.

అసింప్టమాటిక్ యూరిన్ ట్రాక్ ఇన్‌ఫెక్షన్‌లో మూత్రంలో బ్యాక్టీరియా వుంటుంది. కానీ రోగికి ఎలాంటి లక్షణాలు కనిపించవు. ఇది చాలా సాధారణం. మూత్ర పరీక్ష చేసినప్పుడు మూత్రంలో చీము కణాలుండడం, యూరిన్‌లో బ్యాక్టీరియా కనిపించడం వల్ల అసింప్టమాటిక్ యూరిన్ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ బయటపడుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో, వయసు ఎక్కువున్న వారిలో, గర్భిణులలో అసింప్టమాటిక్‌కు చికిత్స చేయడం మంచిది. మధ్య వయసు మహిళల్లోని మూత్రంలో చీము కణాలు, బ్యాక్టీరియా కనిపించి, ఎలాంటి లక్షణాలు లేనప్పుడు చికిత్స చేయాల్సిన అవసరం లేదు.

**చిన్న పిల్లల్లో ...**

నవజాత శిశువుల నుంచి 13 ఏళ్ల వయసు వారిలో ఇన్‌ఫెక్షన్ కనుక్కోవడానికి మూత్ర పరీక్ష చేయాలి. అయితే పిల్లలు ఏ సమయంలో మూత్ర విసర్జన చేస్తారో తెలియదు. అందుకని సూది ద్వారా మూత్రాన్ని తీసి పరీక్షిస్తారు. మరో వైపు పుట్టుకతో పిల్లల్లో వచ్చే అభివృద్ధి సమస్యల్లో రెఫ్లక్స్ వ్యాధి రావడం సాధారణం. మూత్ర విసర్జన సమయంలో మూత్రాశయం నుంచి మూత్రం వెనక్కు మూత్రపిండాల దగ్గరికి వెళ్లకూడదు. అలా వెళ్తే బైలెట్రల్ యూరేటరల్ రిఫ్లెక్స్ డిసీజ్ అంటారు. యూరిన్ ఇన్‌ఫెక్షన్ వచ్చిన వారిలో మొదట రిఫ్లెక్స్ వ్యాధి వుందా? లేదా? అనే విషయాన్ని కనుక్కోవాలి. ఎంసియు ఎక్స్‌రే చేయాలి. తర్వాత అల్ట్రాసౌండ్ పరీక్ష ఐవిపి చేయాలి. దీని వల్ల రెండు కిడ్నీల సైజు ఎలా వుంది? మూత్రాశయం ఎలా నిండుతుంది? మూత్రం ఎలా కిందకొస్తుంది? రాళ్లు వున్నాయా? కిడ్నీలు అసాధారణ పొజిషన్‌లోవున్నాయా? ఒకే కిడ్నీ వుందా? అనే విషయాలు దీని ద్వారా

ENTERED

తెలుసుకుంటారు. దీంతోపాటు యూరిన్ కల్చర్ పరీక్ష కూడా అవసరం.

**పురుషుల్లో...**

మధ్య వయసు పురుషుల్లో మూత్ర ఇన్‌ఫెక్షన్ రావడానికి లైంగిక చర్యల వల్ల సోకే వ్యాధులు కారణం. వివాహేతర సంబంధం, ఒకరి కంటే ఎక్కువ మందితో లైంగిక సంబంధమున్న వారిలో మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ అధికంగా కనిపిస్తుంది. వీటితోపాటు మధుమేహం కూడా మరో కారణం. మధుమేహ వ్యాధిగ్రస్తుల మూత్రాన్ని కల్చర్ పరీక్ష చేయాలి. మొత్తం మూత్రం కాకుండా మధ్యలో పోసిన మూత్రాన్ని సేకరించాలి. వీరికీ ఎంసియుతోపాటు ఆర్‌జియు పరీక్షలు చేయాలి.

**వృద్ధుల్లో ...**

వృద్ధుల్లో వచ్చే మూత్రాశయ ఇన్‌ఫెక్షన్‌కు కారణం పురుషుల్లో ప్రొస్టేట్ గ్రంథి పెరగడం. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో ప్రొస్టేట్ గ్రంథి పెరిగితే పరిస్థితి తీవ్రంగా వుంటుంది. మూత్రాశయం, మూత్రనాళం ఇన్‌ఫెక్షన్ అయితే లోయర్ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ అని, మూత్రపిండాలు, మూత్రనాళం ఇన్‌ఫెక్షన్‌కు గురైతే అప్పర్ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ అని అంటారు. మూత్రపిండాల్లో ఇన్‌ఫెక్షన్ వస్తే పరిస్థితి తీవ్రంగా వుంటుంది. జ్వరం, నడుం నొప్పి, ఆకలి తగ్గడం, రోగి సరిగా పనిచేసుకోలేక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. లోయర్ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ వచ్చిన వారిలో అల్ట్రాసౌండ్ ద్వారా మూత్రపిండాలు, ప్రొస్టేట్ గ్రంథి సైజు, మూత్ర విసర్జన తర్వాత ఎంత మూత్రం మిగులుతుందనేది తెలుసుకుంటారు. యూరిన్ ఎక్కువ మిగిలి, మధుమేహం వున్న వారు ప్రొస్టేట్‌కు సంబంధించిన మందులు కూడా వాడాలి. మధ్య వయసులో, వృద్ధుల్లో మూత్రాశయ ఇన్‌ఫెక్షన్స్ మళ్లీ మళ్లీ వస్తుంటే ఏ రకం రాళ్లు ఉన్నాయనే విషయం తెలుసుకోవాలి. ఇన్‌ఫెక్షన్ వల్ల మెగ్నీషియం, అమోనియం రాళ్లు ఏర్పడతాయి. ఈ రాళ్లను తొలగించే వరకు మూత్రంలో బ్యాక్టీరియా తిష్టవేస్తుంది. ఎన్ని యాంటీబయాటిక్స్ వాడినా రాళ్లు తీసేంత వరకు యూరిన్ ఇన్‌ఫెక్షన్ తగ్గదు.



**చికిత్స ఏంటి?**

మూత్రాశయంలో వచ్చే ఇన్‌ఫెక్షన్‌కు యాంటిబయాటిక్స్‌తో చికిత్స చేస్తారు. అయితే ఏ రకం యాంటిబయాటిక్స్ వాడాలో యూరిన్ కల్చర్ పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. తరచుగా యూరిన్ ఇన్‌ఫెక్షన్ రావడం, మానకుండా మళ్లీ మళ్లీ వస్తుంటే ఇతర కారణం రాళ్లున్నాయా, హార్మోనల్ లోపమా, పుట్టుకతో వచ్చిన లోపమా తెలుసుకోవాలి. లోయర్ యూరినరిట్రాక్ ఇన్‌ఫెక్షన్‌ను మందులతో చికిత్స చేస్తారు. అప్పర్ యూరినరి ట్రాక్‌ను జ్వరం ఉన్నం కాలం ఐవి యాంటి బయాటిక్స్ ఇస్తారు. తర్వాత మందులు వాడాలి. అప్పటికీ తగ్గకుంటే శస్త్ర చికిత్స చేస్తారు. పురుషుల్లో ప్రొస్టేట్ పెరగడం వల్ల ఇన్‌ఫెక్షన్ వస్తే శస్త్ర చికిత్స చేయాలి.

**నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం**

మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ వున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయకూడదు. మూత్రంలో మంట, జ్వరం వుంటే వెంటనే యూరాలజిస్ట్‌ను సంప్రదించాలి. కిడ్నీలో నుంచి వచ్చే నాళంలో బ్లాక్‌లో ఇన్‌ఫెక్షన్ వుంటే కిడ్నీలు దెబ్బతినడానికి 24 గంటల నుంచి 48 గంటల సమయం పడుతుంది. ఇది చాలా ప్రమాదకర పరిస్థితి. దీర్ఘకాలంగా మధుమేహం వున్న వారిలో మూత్రపిండాలు దెబ్బతినే అవకాశముంది. షుగర్ పెరిగి మూత్రం బయటికొచ్చే భాగంలో చిన్న కణజాలం చిరుగుతుంది. ఈ ముక్కలు మూత్రనాళంలో ఇరుక్కోవడం వల్ల ఇన్‌ఫెక్షన్ వచ్చి కిడ్నీలు దెబ్బతినే అవకాశముంది. ఇన్‌ఫెక్షన్ వుండి రాళ్లు కనిపించకపోయినా, కిడ్నీ సరిగ్గా పనిచేయకపోయినా సిటి స్కాన్ చేయాల్సి వుంటుంది. ఇన్‌ఫెక్షన్‌ను నిర్లక్ష్యం చేస్తే మూత్రపిండాల్లో గ్యాస్ ఏర్పడే బ్యాక్టీరియాతో ఇన్‌ఫెక్షన్ వచ్చే అవసరముంది. కిడ్నీలో ఇన్‌ఫెక్షన్ తీవ్రమై, కిడ్నీ మొత్తం గ్యాస్‌తో నిండి రోగి మరణించే అవకాశముంది. ఇలాంటి సమయంలో ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను కలిస్తే యంటిబయాటిక్స్ వాడడంతోపాటు, సర్జరీ చేస్తారు. ఆలస్యం చేస్తే మూత్రపిండాలను తొలగిస్తారు. ❄




**వీరి వీరి గుమ్మడి పండు**

**వీరి పేరేమి?**



ఈ ఫొటో ఓ ప్రముఖ నటుడిది. జవాబు తెలియాలంటే 21వ పేజీ చూడండి.

సీరియల్

మూలం : **బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)**

తెలుగు సేత: **ముక్తవరం పార్థసారథి**

లిటిల్ క్రో

**జరిగినకథ:**

**కొందరు రాంచర్లు, టెటాన్‌లను ఇండియన్ టెరిటరీకి తరలించాలని ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచారు. మరి కొందరు మిస్సోరి రివర్ వద్దే ఆవాసాలు కల్పించాలన్నారు. రెడ్‌క్లౌడ్ స్పాటెడ్ టెయిల్‌ల తీవ్ర నిరసనల తర్వాత ప్రభుత్వం రాజీకి వచ్చింది. ఓగ్లాలందరూ (రెడ్‌క్లౌడ్ తెగ) పైన్ రిడ్జ్ వద్దనున్న వాజీ అహన్హన్ రిజర్వేషన్‌లో వుండాలని ఇరుపక్షాలూ అంగీకరించాయి. ఇక్కడ, అనేక ఉపతెగలకు చెందిన ఓగ్లాలాలు వైట్‌రివర్ పొడవునా శాశ్వత నివాసాలు ఏర్పరచుకున్నారు. ఎల్లో మెడిసిన్, పోర్కుపైన్ టెయిల్, వూండెడ్‌నీ వగైరాలు ఇక్కడి ముఖ్య ఆవాస కేంద్రాలు. పైన్ రిడ్జికి తూర్పున స్పాటెడ్ టెయిల్ అతని బ్రూల్ తెగలవాళ్లూ లిటిల్ వైట్ రివర్ సమీపంలో స్థిరపడ్డారు.**

# అమెరికన్ తెగ

**(68వ భాగం)**

టెటాన్‌లు కొత్త గ్రామజీవితానికి అలవాటు పడుతున్నప్పుడే, యూరోపు నుండి జన ప్రవాహం అలలు అలలుగా తూర్పు డకోటాకు వలస వచ్చింది. మిస్సోరీ రివర్ వద్ద వున్న గ్రేట్ సియో రిజర్వేషన్ భూమి ఆకర్షణీయంగా కనిపించింది. బిస్మార్క్ (మిస్సోరీ) వద్ద రైల్వే లైన్లకు రిజర్వేషన్ అడ్డు వచ్చింది. మోంటానా ఇంకా వుత్తరంగా వెళ్ళవలసిన వాళ్ళకు రూటు చాలా ముఖ్యం. రిజర్వేషన్‌ను విచ్ఛిన్నం చేసి, భూమి కబ్జా చేసుకొని రైల్వే కంపెనీకి అమ్మితే మిలియన్లు సంపాదించవచ్చు.

ఒకప్పుడైతే, సియోలు తమ భూమిని రక్షించుకోవటానికి ప్రాణాలకు కూడా ఒడ్డి పోరాడేవారు. కాని ఇప్పుడు వాళ్ళు నిరాయుధులు, గుర్రాలు కూడా లేవు. తిండికీ, గుడ్డకు కూడా తెల్లవాళ్ళ ముందరే చేతులు చాపాల్సిన దయనీయ స్థితిలో వున్నారు. వాళ్ళ మహానాయకుడు సిట్టింగ్ బుల్ కెనడాలో ప్రవాసం వుంటున్నాడు. అతనూ, అతడి మూడు వేల మంది యోధులూ వచ్చి రక్షిస్తే తప్ప తాము చెయ్యగలిగిందేమీ లేదు.

మెక్సికోలో వుంటున్న జెరోనిమో లాగా, కెనడాలో వుంటున్న సిట్టింగ్ బుల్ యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వానికి "డెడ్ ఆర్ అలైవ్" పట్టుకోవలసిన ప్రధాన శత్రువు. ఇతని తలకు వెలగట్టటమే కాదు. అతని సైనిక బలగాన్నంతా వాళ్ళ వేటకే వినియోగించింది. అయినా ఫలితం కనిపించలేదు. చివరికి, 1877 సెప్టెంబర్‌లో వార్ డిపార్ట్‌మెంట్, కెనడియన్ ప్రభుత్వంతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం, రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ పర్యవేక్షణలో, జనరల్ ఆల్ఫ్రెడ్ టెరీ తన ప్రత్యేక సైనిక బృందంతో ఫోర్ట్ వాల్స్‌కు చేరుకుంటాడు. అక్కడ, అతడి సిట్టింగ్‌బుల్‌తో చర్చలు జరిపి, ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించిందన్న విషయాన్ని కూడా అతనికి చేరవేస్తారు. ఇందుకు ప్రతిగా సిట్టింగ్‌బుల్, అతని ఆయుధాలు వదిలి, లొంగిపోతున్నట్టుగా ప్రకటించి, తన హాంక్‌పాపా అనుచరులతో కలిసి గ్రేట్ సియో రిజర్వేషన్‌లో వున్న స్టాండింగ్ రాక్ ఏజెన్సీకి రావలసి వుంటుంది.

మొదట, టెరీతో సమావేశానికి సిట్టింగ్‌బుల్ ఆసక్తి కనపర్చలేదు. అమెరికన్లతో మాట్లాడి లాభం లేదు. వాళ్ళు అందరూ అబద్ధాల కోర్లు. వాళ్ల మాటలు నమ్మకూడదు" అని మౌంటెడ్ పోలీస్ కు చెందిన కమిషనర్ జేమ్స్ మాక్లియాడ్‌తో తన మనసులోని మాట చెప్పాడు. కాని, ఎలాగైనా సిట్టింగ్‌బుల్ కెనడా విడిచి వెళ్ళటమే శ్రేయస్కరమని భావించిన మాక్లియాడ్, అక్టోబర్ 17న ఫోర్ట్‌వాల్ట్‌లో సమావేశానికి ఒప్పించాడు.

"ఇండియన్లందరూ యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వ అధికారాన్ని అంగీకరించాలి. ఇంకా లొంగిపోనిది మీరు మాత్రమే. గ్రేట్ ఫాదర్ ఆదేశాల మీద కేవలం మీ కోసం ఇన్ని వందల మైళ్లు వచ్చాం. మీ సోదరులలాగే మీరు కూడా సరెండరవుతారని ఆశిస్తున్నాం. దేశంలో శాంతి స్థాపనే ప్రభుత్వ లక్ష్యం. సహకరించండి. అందరం సోదరుల్లా కలసి బతుకుదాం. ఇప్పటికే చాలా నెత్తురు ప్రవహించింది. ఇక ఈ దాడులు, ప్రతిదాడులకు అంతం పలకాలి" అంటూ వుపన్యాసం ప్రారంభించాడు టెరీ.

"కాని, మేమేం నేరం చేశామని మమ్మల్ని జంతువుల్ని కాల్చినట్లు కాల్చివేశారు. ఎందుకు మా భూములు లాక్కున్నారు? ఎందుకు మమ్మల్ని రిజర్వేషన్లలో ఏజెన్సీలలో బంధించారు? దాడులకు పాల్పడింది మీరా, మేమా? ఎవరు ప్రారంభించారీ నరమేధం? మా దేశం విడిచి మమ్మల్ని పొమ్మంటే ఎక్కడ తల దాచుకోగలం? అసలు, ఇప్పుడు మీరిక్కడికి ఎందుకొచ్చారు? మరిన్ని అబద్ధాలు చెప్పటానికి వచ్చారు. అంతేనా? ఇక చాలు. మీ మాటలు వినదలచుకోలేదు. సరిహద్దులు గీసేది మీరే. చెరిపేసేది మీరే. ఇక ఒక మాట మీనోట రాకూడదు. తక్షణమే వెళ్ళిపోండి. మేమిక్కడే వుంటాం" అంటూ ఆవేశంగా అరిచాడు సిట్టింగ్ బుల్.

ఆ తర్వాత, అతని అనుచరులు అనేకులు అదే ధోరణిలో తమ కోపాన్ని వెళ్ళగక్కారు. అక్కడే వుంటున్న సాంటీ, యాంక్టన్ తెగలవాళ్ళు కూడా వీళ్లతో గొంతు కలిపారు. ఆ తర్వాత, ఒక స్త్రీని సభికులకు పరచయం చేశాడు సిట్టింగ్ బుల్. ఆమె పేరు ది- వన్ హూ - స్పీక్స్- వన్స్. అతిథిని (టెరీని) ఒక స్త్రీ సంబోధించటమంటే, అతణ్ణి అవమానించటానికే, తమ నాయకుడిలా చేసి వుంటాడనుకున్నారు కొందరు ఇండియన్లు. "నేను మీ దేశంలో కొన్నాళ్ళుండి వచ్చాను. కాని అక్కడ, మాలాంటి స్త్రీలకు పిల్లల్ని కనే అవకాశమే దొరకదు. ఇక్కడికొచ్చి పిల్లాపాపలతో ప్రశాంతంగా జీవిస్తున్నాం. నేను చెప్పదలచుకున్నదింతే. మీరు వచ్చిన చోటికే తిరిగి వెళ్లండి. మేమిక్కడే వుంటాం" అంటూ వ్యంగ్యంగా మాట్లాడిందావిడ.

సమావేశం ముగిసింది. సిట్టింగ్ బుల్ తన ప్రతిపాదనలకు సుముఖంగా లేడని తెలుసుకున్నాడు టెరీ. ఇక కమిషనర్ మాక్లియాడ్ మధ్యవర్తిత్వమే మిగిలింది. అతడు చెబితే ఇండియన్లు వినే అవకాశముంది (అదే చివరి ఆశ)! టెరీ అభ్యర్థన మేరకు, సిట్టింగ్‌బుల్‌తో చాలాసేపు మాట్లాడాడు మాక్లియాడ్. సిట్టింగ్‌బుల్‌ను కెనడాలో తాత్కాలికంగా శరణుజొచ్చిన అమెరికన్ ఇండియన్‌గానే (కెనడా)

ప్రభుత్వం పరిగణిస్తుందనీ, అతడికి బ్రిటిష్ ఇండియన్ 'పౌరసత్వం దొరకదనీ స్పష్టం చేశాడు. కెనడాలో తలదాచుకుంటూ సరిహద్దు దాటి దాడులకు పాల్పడితే అప్పుడు అమెరికన్లే కాదు. మా మౌంటెడ్ పోలీస్ కూడా మిమ్మల్ని శిక్షించక వదలరు. మీరిక్కడికి వచ్చింది బర్రెల మాంసం కోసం. కాని ఆ మందులు కూడా క్రమేణా తగ్గిపోతాయి. అప్పుడేం చేస్తారు?" అంటూ కటువుగా మాట్లాడాడు.

కాని సిట్టింగ్ బుల్ ఆ మాటలకు బెదరలేదు.

'ఇది మా గ్రాండ్ మదర్స్ లాండ్" అన్నాడు సిట్టింగ్ బుల్ (అమెరికా గ్రాండ్ ఫాదర్స్ లాండ్) బ్రిటిష్ రాణి (కెనడా, బ్రిటన్ అధీనంలో వుంది) గ్రాండ్ మదర్).

మరునాడు తిరుగుముఖం పట్టిన టెరీ 'వీళ్లను మనం శత్రువులుగానే భావించాల్సి వుంటుంది. ఈ ఇండియన్లిక్కడ వున్నంత వరకూ సరిహద్దులో ముప్పు పొంచివున్నట్టే" అంటూ వార్ డిపార్ట్‌మెంట్‌కు తన రిపోర్ట్ పంపించాడు.

కెనడాలో నాలుగేళ్ల పాటు తన ప్రవాసం కొనసాగించాడు. సిట్టింగ్ బుల్ ప్రభుత్వం సహకరిస్తే బహుశా ఇండియన్లు, ఆ సస్కాకెవాన్ మైదానాల్లోనే జీవితమంతా గడిపేవాళ్ళే. కాని, మొదటి నుండీ, ఇండియన్ల వల్ల తమకు చిక్కులు రాక తప్పదని భావించింది. క్వీన్ ప్రభుత్వం. సిట్టింగ్ బుల్‌కు ఆతిథ్యం ఇవ్వటమంటే అమెరికాతో శతృత్వం కొని తెచ్చుకోవటమే. పైగా వీళ్లను అదుపులో పెట్టటానికి ప్రత్యేకంగా మౌంటెడ్ పోలీస్‌ను వినియోగించక తప్పలేదు.

వాళ్ళకయ్యే ఖర్చు అదనం. అంటే సిట్టింగ్ బుల్ చాలా ఖరీదైన అతిథి! పార్లమెంటులో కొందరు సభ్యులు అతని మీద జోకులు కూడా వేశారు.

1878, ఫిబ్రవరి 18 నాడు కెనడియన్ హౌజ్ ఆఫ్ కామన్స్‌లో, సిట్టింగ్ బుల్ సరిహద్దు ధాటి రావటం వల్ల ప్రభుత్వానికి అదనంగా ఎంతో ఖర్చవుతుందని ప్రశ్న వేశాడు.

**సర్ జాన్ మాక్డొనాల్డ్:** సిట్టింగ్ బుల్ (కూర్చున్న ఎద్దు) సరిహద్దు ఎలా దాటగలదు?

**మిస్టర్ మెకెంజీ:** లేచి నిల్చుంటే తప్ప.

**సర్ జాన్:** అప్పుడది 'సిట్టింగ్ బుల్' ఎలా అవుతుంది?

తమ దేశంలో శరణుజొచ్చిన సియోల గురించి ఎప్పుడు చర్చ జరిగినా, పార్లమెంటులో జరిగిన చర్చల స్థాయి ఇలాగే వుండేది. (వాళ్ళంటే అందరికీ చులకనే) కెనడియన్ ప్రభుత్వం నుండి ఏ సహాయమూ అందలేదు. ఎముకలు కొరికే చలిలో గుడ్డల్లేక, తిండికి మాడి, వుండటానికి ఆవాసాలు లేక నానా ఇక్కట్లూ పడ్డారు. వేట జంతువులు దొరకలేదు. ఫలితంగా మాంసం కరువొచ్చింది. తోళ్లు కూడా లేవాయే (జంతువుల చర్మాలను దుస్తులకూ, టెంటులకూ ఉపయోగిస్తారు). ఇన్ని కష్టాలు పడుతూ ఇక్కడెందుకుండటం? పిల్లలకూ, పెద్దలకు కూడా సరిహద్దు దాటి స్వదేశం


స్పాటెడ్ టెయిల్

పోవాలనిపించింది. ఆకలికి తట్టుకోలేని కొందరు రహస్యంగా దక్షిణం వైపు పయనించి డకోటా లోని సియో ఏజెన్సీలను చేరుకున్నారు.

కెనడాలోనే తమకో రిజర్వేషన్ ఏర్పాటు చెయ్యమని ప్రభుత్వాన్ని ఎంతో వేడుకున్నాడు సిట్టింగ్ బుల్'. కాని అతడు బ్రిటిష్ పౌరుడు కాదు. అందువల్ల భూమి మీద హక్కుండదు" అని సమాధానం వచ్చింది. 1880 శీతాకాలంలో తుఫానుల తీవ్రతను తట్టుకోలేక, సియోల గుర్రాలనేకం గడ్డకట్టుకుపోయి మరణించాయి. ఒకరినొకరు సంప్రదించు కోకుండా, ఎవరికి వారే, కాలినడకన, దక్షిణ దిశగా ప్రయాణం కొనసాగించారు. సిట్టింగ్‌బుల్‌కు అత్యంత సన్నిహితులు, విశ్వసనీయులైన లెఫ్టినెంట్లు గాల్, క్రోకింగ్‌లు కూడా గ్రేట్ సియో రిజర్వేషన్ దిశగా కదిలారు.

చివరికి, 1881, జూలై 19 నాడు సిట్టింగ్ బుల్ కూడా మిగిలిన తన 186 మంది అనుచరులతో సరిహద్దు దాటి ఫోర్ట్ బఫర్డ్ చేరుకున్నాడు. అప్పటికి అతని పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఒంటిమీద ఒక చిరిగిన కాలికో షర్టు, ఒక మురికి బ్లాంకెట్‌తో వచ్చిన ఆ ఛీఫ్‌ను చూసి జాలిపడ్డారు.

అకాల వృద్ధాప్యం వచ్చినట్లుగా చర్మం ముడతలు పడింది. విచార వదనంతో ఫోర్టులోకి ప్రవేశించిన సిట్టింగ్ బుల్, తన వించెస్టర్ రైఫిల్‌ను కమాండింగ్ ఆఫీసర్‌కు సరెండర్ చేశాడు. సైన్యం మరోసారి చేసిన వాగ్దానాలను ఉల్లంఘించింది. అతడికి క్షమాభిక్ష ప్రసాదించటానికి బదులు, ఫోర్ట్ రాండాల్‌లో అతణ్ణి 'మిలటరీ ఖైదీగా నిర్బంధించింది.

1881 వేసవి కాలంలో "సిట్టింగ్ బుల్ పునరాగమనం దేశంలో చర్చనీయాంశం కావలసిందే. కాని స్పాటెడ్ టెయిల్ హత్యతో దీన్నెవరూ పెద్దగా పట్టించుకోలేదు. హంతకుడు తెల్లవాడు క్రోడాగ్. ఇతడు స్పాటెడ్ టెయిల్ అనుచరుడే. రోజ్ బడ్ రిజర్వేషన్‌లో గుర్రపు స్వారీ చేస్తున్న ఈ బ్రూల్ నాయకుణ్ణి హఠాత్తుగా కాల్చాడు.

"ఒక స్త్రీ మూలంగా ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణ ఫలితమే ఈ దారుణం" అని కొట్టి పారేశారు. తెల్ల అధికారులు. కాని స్పాటెడ్ టెయిల్ మిత్రులు దీని వెనక పెద్ద కుట్రే వుందన్నారు. ఇండియన్ బ్యూరో ఏజెంట్ల అడుగులకు మడుగులొత్తని ఇండియన్ నాయకత్వాన్ని బలహీన పరచటానికే ఇలా జరిగిందని వాదించారు. "తన ప్రజల కోసం కృషి చేస్తున్న ఇండియన్ ఛీఫ్‌ను ఒక అనామకుడు నిష్కారణంగా ఎందుకు హత్య చేస్తాడు? దీని వెనక వున్నతాధికారులు, రాజకీయ నాయకుల ప్రమేయం వుంది".

స్పాటెడ్ టెయిల్ హత్యోదంతం సద్దుమణిగిన తర్వాత గ్రేట్ రిజర్వేషన్‌లో వున్న సియోలు సిట్టింగ్ బుల్ వైపు దృష్టి మళ్లించారు. అనేక మంది నాయకులు, వుపనాయకులు దూర ప్రాంతాల నుండి కూడా వెళ్ళి అతణ్ణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఒక మహా నాయకుడైనా ఇంకా మిగులున్నాడనే తమ ధైర్యం! జర్నలిస్టులు వచ్చి ఇంటర్వ్యూలు చేశారు. తననందరూ మరచిపోయారనుకున్న సిట్టింగ్ బుల్ ఇప్పుడందరి దృష్టిలోనూ 'పెద్ద నేత'. 1882లో వివిధ సియో ఏజెన్సీలు ప్రతినిధులు అతని సలహా కోసం వచ్చారు. గ్రేట్ రిజర్వేషన్‌ను ముక్కలు చేసి సగం భూమిని తెల్లవాళ్లకోసం అమ్మాలని ప్రభుత్వ ప్రతిపాదన. 'మనకే వసతి ఇబ్బందిగా వున్నప్పుడు అమ్ముకోవడమెందుకన్నాడు" సిట్టింగ్ బుల్.

ఎంత ప్రతిఘటించినప్పటికీ, 1882లో సుమారు 14,000 చదరపు మైళ్ల ప్రాంతాన్ని కోల్పోక తప్పదనుకున్నారు సియోలు. న్యూటన్ ఎడ్మండ్స్ ఆధ్వర్యంలో వచ్చిన ఒక కమిషన్ బేరసారాలు జరిపింది (ఇండియన్లను మభ్యపెట్టి భూమి కాజెయ్యటంతో ఎడ్మండ్స్ సిద్ధహస్తుడు). కమిషన్‌లో వున్న ఇతర సభ్యులు పీటర్ షానన్ (లాయర్), జేమ్స్ టెల్లర్ (ఇతను ఇంటీరియర్ సెక్రటరీగారి సోదరుడు).

వెంట ఒక దుబాసీ కూడా వచ్చాడు. అతడే సామ్యూల్ డి. హిన్మాన్ -'లిటిల్ క్రో' కాలం నుండి సియోలకు మత గురువు (మిషనరీ).

"ఇండియన్లకు కావలసింది క్రిస్టియన్ మత విశ్వాసం, భూమి కాదు' ఆయన అభిప్రాయం.

ఏజెన్సీ నుండి ఏజెన్సీకి తిరిగి వివరాలు సేకరించింది కమిషన్. పరిపాలనా సౌలభ్యం కోసం 'ఇండియన్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని" ఆరు చిన్న ఏజెన్సీలు ఏర్పరచాలని ఛీఫ్‌లకు సూచించారు" ఇదే శాశ్వత పరిష్కారం. అక్కడ మిమ్మల్నెవరూ ఇబ్బంది పెట్టరు. తరతరాలుగా ఏజెన్సీల మీద హక్కులు ఇక మీవే అన్నారు. "పునర్విభజన తర్వాత, గ్రేట్ ఫాదర్ మీకు 25,000 వేల ఆవులు, 1,000 ఎద్దులు ఇస్తాడు" అని రెడ్‌క్లౌడ్‌కు ఆశ చూపాడు. హిన్మాన్ అయితే, ఆ బహుమతి లభించాలంటే సియోలందరూ కమిషనర్లు తెచ్చిన కాగితాల మీద సంతకాలు చెయ్యాలి. అలా చదువు రాని ఇండియన్లు 14000 చదరపు మైళ్ల భూమిని ఆవుల కోసం, ఎద్దుల కోసం రాసివ్వటానికి సిద్ధపడ్డారు.

**ఇంకా వుంది....**

# నేనొక హిజ్రా అనుకుని...

**షియాజీ షిండే... మహారాష్ట్ర కొండ కోనల్లో ఓ కుగ్రామంలో పుట్టి తెలుగు చిత్రసీమలో ప్రముఖ విలన్లలో ఒకడిగా వెలుగొందుతున్నారు. ఈయన నటుడే కాదు, నిర్మాత కూడా. రాజేంద్రప్రసాద్ హీరోగా నటించిన 'ఆ నలుగురు' చిత్రాన్ని మరాఠీలో రీమేక్ చేసి చేతులు కాల్చుకున్నారు. అయినా బాధ లేదంటున్నారు. ఓ మంచి కథను మరాఠీ ప్రేక్షకులకు అందించినందుకు ఆనందంగా ఉందంటున్నారు. మాతృభాష మరాఠీ అయినా అక్కడి ప్రేక్షకులు తనను దక్షిణాది నుంచి వచ్చిన నటుడిగా భావించడం గమ్మత్తుగా ఉందంటున్న షిండేతో కాసేపు...**

**నటుడిగా అవతరించడానికి మీలో ఏయే అంశాలు దోహదపడ్డాయి?**

జీవితంలో ప్రతి మనిషి నటుడే. ఈ విషయం ప్రతి ఒక్కరికీ తెలుసు. కాకపోతే మాలాంటివారు స్క్రీన్ బయటే కాకుండా స్క్రీన్‌పై కూడా నటిస్తుంటారు. ఓవర్ నైట్‌లో నటుణ్ణి కాలేదు. అలాగే ఏదో సడెన్‌గా తీసుకున్న నిర్ణయమూ కాదు. నటుడు కావాలన్న బలమైన నిర్ణయం చిన్నప్పటి నుంచీ నాలో పెరుగుతూ వచ్చింది.

**మీలాంటి విలన్లు నార్త్ నుంచి రావడంతో లోకల్ టాలెంట్ పైకి రావడంలేదన్న విమర్శను ఎలా స్వీకరిస్తారు?**

ఎవరు లోకల్? ఎవరు నాన్ లోకల్? మనందరిదీ ఒకటే జాతి. అది భారతజాతి. 'లోకల్', 'నాన్ లోకల్' పదాలు నన్ను ఎందుకో ఇబ్బందికి గురి చేస్తాయి. 'నాన్ లోకల్' వాడినైన నన్ను తెలుగు ప్రజలు ఎందుకింతగా అభిమానిస్తున్నారు? రైల్వే స్టేషన్, ఎయిర్ పోర్ట్, గుడి... ఎక్కడికెళ్ళినా నన్ను వెంటనే గుర్తుపట్టి నవ్వుతుంటారు. షేక్ హ్యాండ్ ఇస్తుంటారు. చివరికి చిన్న పిల్లలు కూడా గుర్తుపట్టి పలకరిస్తున్నారే! మరి 'లోకల్', 'నాన్ లోకల్' అని నన్ను ఎందుకు విమర్శిస్తారో అర్థంకావడం లేదు.

**మరాఠీ అయిన మీరు బాలీవుడ్‌లో ఏమన్నా ట్రైల్స్ వేశారా?**

కెరీర్ ప్రారంభంలో ట్రైల్స్ వేశాను. ప్రస్తుతం తెలుగులో మంచి గుర్తింపు వచ్చింది. ఇక అటుగా ప్రయత్నాలు సాగించలేదు. మీకింత వరకూ తెలియని ఓ విషయం చెబితే ఆశ్చర్యపోతారు. నేను దక్షిణాది నుంచి వచ్చిన నటుణ్ణి అని నార్త్ వాళ్ళు అనుకుంటుంటారు.

**ఈమధ్య కాలంలో నటులు, దర్శకులు నిర్మాతలుగా మారుతున్నారు. మరి మీ విషయంలో...**

అవును. నేనూ ఒక నిర్మాతనే. కానీ విషయం కొద్దిమందికే తెలుసు. 'ఆ నలుగురు' సినిమా బాగా నచ్చి, మరాఠీలో (మాజి మానస) రీమేక్ చేశాను. కేవలం డబ్బు కోసమే ఈ చిత్రాన్ని రీమేక్ చేయలేదని గర్వంగా చెప్పగలను. సబ్జెక్ట్ బాగా నచ్చింది.

**'మాజి మానస' ఎలా ఆడింది?**

చాలా డబ్బు పోగొట్టుకున్నాను. అయినా బాధపడను. డబ్బు కోసం ఈ చిత్రం నిర్మించలేదని ముందే చెప్పాను కదా! ఈ యూనివర్సల్ సబ్జెక్టును హిందీలో కూడా రీమేక్ చేయాలన్న బలమైన కోరిక ఉంది. అది నెరవేరని పక్షంలో చివరికి డబ్బింగ్ అన్నా చేస్తా. హిందీలో నిర్మించడానికి రీమేక్ హక్కులు ఇమ్మని 'ఆ నలుగురు' కథకుడు మదన్‌ని అడిగాను. కానీ ఆయన ఇవ్వలేదు. అయినా అడుగుతూనేవున్నాను. ఒకవేళ ఆయన ఇవ్వకపోతే.... 'మాజి మానస'కు మంచి పబ్లిసిటీ ఇచ్చి మరోసారి మరాఠీలోనే విడుదలచేస్తాను. నాముందున్న ఏకైక లక్ష్యం.... మహారాష్ట్రలో ఉన్న ప్రజలందరూ 'మాజి మానస'ను చూడాలనుకోవడం.

**మీరు 50 ప్లస్‌లో కూడా ఎనర్జిటిక్‌గా కనిపిస్తున్నారు. సీక్రెట్...**

ప్రతి రోజూ యోగా చేస్తుంటాను. పాజిటివ్ ఆలోచనలతో మనసును ప్రశాంతంగా ఉంచుతాను. పాజిటివ్ ఆలోచనల గురించి ప్రతి ఒక్కరూ ఏవేవో పెద్ద మాటలు చెబుతుంటారు. కానీ నా వరకు 'పాజిటివ్ థింకింగ్' అనేది చాలా తేలికైంది. ఎవరినీ ద్వేషించకుండా, అందరినీ ప్రేమించడమే ఇందులోని రహస్యం.

**మిమ్మల్ని ఎక్కువగా ఎవరు ప్రభావితం చేశారు?**

చిన్న పిల్లలు. చాలామంది పిల్లలను అబ్జర్వ్ చేస్తుంటాను. ఈరోజు ఉదయం కూడా స్కూల్‌కు వెళ్తున్న చిన్నారులను చూశాను. వాళ్ళ చిరునవ్వు, మాట, నడక... అన్నీ అమాయకంగా ఉంటాయి. కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, అబద్ధాలకు దూరంగా మనిషి ఉండేది బాల్యంలోనే కదా! అందుకే చిన్నారులను అమితంగా ఇష్టపడతాను. అలాగే ప్రేరణ పొందుతాను.

**మీ బాల్యం గురించి చెప్పండి?**

మహారాష్ట్రలో ఓ కుగ్రామంలో జన్మించాను. చుట్టూ అడవి, కొండలు. మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు చాలా కష్టాలుపడ్డారు. ఆ జ్ఞాపకాలు ఇంకా కళ్ళ ముందు మెదులుతూనే ఉన్నాయి. ఊళ్లో అందరూ పొట్ట కూటి కోసం రోజంతా కాయకష్టం చేసేవారు. సాయంత్రం కాగానే వర్గ బేధాలు లేకుండా అందరూ కలిసి కబుర్లు చెప్పుకునేవారు. ఇప్పటికీ బాల్య స్నేహితులు టచ్‌లో వున్నారు.

**విలన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుని కూడా క్యారెక్టర్ రోల్స్ వేస్తున్నారే!**

ఎందుకు వేయకూడదు? ఒకే రకమైన ఇమేజ్‌లోనే ఇరుక్కుపోవాలనుకోవడం లేదు. మంచి ఆర్టిస్టుగా పేరు సంపాదించాలి. అది ఏ పాత్ర అయినా కానీయండి. కోట్లాది జనాభాలో నాకన్నా మెరుగైన టాలెంట్ వున్నవాళ్ళు చాలామంది ఉన్నారు. కాకపోతే వాళ్ళకి ఛాన్సులు రావడం లేదు. సినిమాకు ప్రతి పాత్రా ముఖ్యమైందే. విలన్‌గా నటిస్తుంటే ప్రేక్షకులు నన్ను నిజమైన విలన్‌గా భావించాలి. పోకీవాడిగా నటించాల్సివస్తే... అందులోకి పరకాయ ప్రవేశం చేస్తాను. కెరీర్ ప్రారంభంలో ఓ మరాఠీ చిత్రంలో హిజ్రాగా నటించాను. నా పాత్రకు స్టేట్ అవార్డ్ వచ్చింది. నేను నిజ జీవితంలో కూడా హిజ్రా అనుకుని ప్రేక్షకులు నాపై పందాలు కూడా కట్టారు. పాత్రకు న్యాయం చేయలేనప్పుడు నటనను వదిలేసి వెళ్ళిపోవడం బెటర్.

**మీ హాబీస్...**

మధురమైన పాత పాటలు వినడం, స్నేహితులతో గడపడం, రాయడం. 'పంచ్ మహా భూత్' అనే నాటకం రాశాను.

**'పంచ్ మహా భూత్' అంటే?**

పంచ్ మహా భూత్ అంటే ఆకాశం, నీరు, అగ్ని, భూమి, గాలి. వీటిలోని శక్తిని నమ్ముతాను. ఇవి లేకపోతే ప్రపంచమే లేదు. ప్రతి ఒక్కరికీ వాటిపై అవగాహన కల్గించి ప్రాముఖ్యతను తెలిపే ప్రయత్నమే 'పంచ్ మహా భూత్'.

**మళ్ళీ నిర్మాతగా ఎప్పుడు కనబడతారు?**

మంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను. ఈమధ్యనే ఓ వ్యక్తి ఫోన్ చేసి 'షిండేజీ... నేను 15 కోట్లతోపాటు పూర్తి స్వేచ్ఛ ఇస్తాను. ఓ చిత్రాన్ని నిర్మించండి' అని అడిగారు. ఇతరుల డబ్బుతో సినిమా తీసే వ్యక్తిని కాదని చెప్పేశాను.

❄



## రొయ్యలు- కోడిగుడ్ల పులుసు

**కావలసిన పదార్థాలు:** కోడిగుడ్లు- నాలుగు
కొత్తిమీర- ఒక కట్ట, రొయ్యలు- పావుకేజి, చింతపండు-పావుకిలో
ఉల్లిపాయలు- పావుకిలో, పచ్చిమిర్చి- మూడు, కారం- ఒకస్పూను
ఉప్పు - సరిపడా, నూనె- 50 గ్రాములు, పసుపు- కొంచెం

**తయారు చేసే విధానం**

రొయ్యలను వొలిచి శుభ్రంగా కడిగిపెట్టుకోవాలి. కోడిగుడ్లను ఉడకబెట్టి పెంకు తీయాలి. చింతపండును నీళ్లుపోసి నానబెట్టాలి. ఉల్లిపాయలు- పచ్చిమిర్చి ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఒక కళాయిలో నూనె పోసి బాగా కాగిన తర్వాత రొయ్యలు- కోడిగుడ్లు వేసి కొంచెం సేపు వేపుకోవాలి. బాగా వేగాక ఉల్లిపాయలు, పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. అది మగ్గాక కారం-పసుపు-ఉప్పు వేసి పావుశేరు ఎసరు వేయాలి. కాసేపు ఉడికాక చింతపండు పిసికి పులుసు పోయాలి. బాగా మగ్గాక కొత్తిమీర వేసి దింపేయాలి.






## చేప పచ్చడి

**కావలసిన పదార్థాలు**
మంచి చేప ముక్కలు- పావు కిలో, వెనిగార్- పావుశేరు
పచ్చిమిర్చి- పదిహేను, నూనె- 250 - గ్రాములు, ఉప్పు- ఒక స్పూను,
పసుపు-అరస్పూను, మసాలా దినుసులు- కొంచెం
జీలకర్ర- సరిపడా, వెల్లుల్లిపాయలు- రెండు పెద్దవి, ఎండుమిర్చి- పదిహేను, అల్లం- చిన్న ముక్క, జీలకర్ర- కొంచెం, కొత్తిమీర- ఒక కట్ట

**తయారు చేసే విధానం**

వెల్లుల్లిపాయ వొలిచి బద్దలు విడదీయండి. అల్లం పైచెక్కు తీయండి. ఈ రెండిటినీ సన్నని ముక్కలుగా తరిగి ఉంచుకోండి. పచ్చిమిరపకాయలను నిలువుగా పీలికలుగా కోసి ఉంచుకోవాలి. చేపలను శుభ్రంగా కడిగి మీకు కావలసిన సైజులో ముక్కలుగా కోసి ఉంచాలి. పసుపు- ఉప్పు కలపండి. ఒక కళాయిలో నూనె పోసి బాగా వేగిన తరువాత ఈ ముక్కలు వేసి వేయించండి. ముక్కలు వేయించగా కళాయిలో మిగిలిన నూనె అలా ఉంచండి. ఎండు మిరపకాయలను వెనిగార్‌లో నానబెట్టండి. ఇప్పుడు మిగిలిన నూనెను ఒక గ్లాసులో పోయండి. అందులో ఆవాలు- జీలకర్ర- మెంతులు- సగం సగం వేయించండి. వెనిగార్‌లో నుంచి మిరపకాయలు తీసి పల్చగా నూరండి. వేయించిన ఆవాలు మొదలగు వాటిని బాగా నూరి ఉంచుకోండి. ఒక బాణలిలో నూనె పోసి ఆవాలు చిటపటలాడేటప్పుడు ఎండుమిరపకాయల ముద్ద వేయండి. అన్నీ బాగా ఉడికిన తర్వాత ఆ గ్లాసు నూనె వేయండి. అంతా మిక్స్ అయ్యేలా కలపండి. చేప పచ్చడి రెడీ.

## ఉండ్రాళ్లు

**కావలసిన పదార్థాలు:** పావు కిలో బియ్యం, రెండింతలు నీళ్లు, తగినంత ఉప్పు, పిడికెడు సెనగపప్పు

**తయారుచేసే విధానం:** బియ్యాన్ని రవ్వ పట్టించాలి. సెనగపప్పును కాసేపు నానబెట్టి రవ్వలో కలపాలి. నీటిని మరిగించి రవ్వ వేసి, తగినంత ఉప్పు కూడా వేయాలి. కలియబెడుతూ ముద్దగా అయ్యాక దించేయాలి. కాస్త చల్లారాక, చేతికి నూనె రాసుకొని, వుండలు చేయాలి. వాటిని ఇడ్లీ స్టాండులో పెట్టి, ఆవిరి మీద ఉడికించాలి. వీటిని వినాయకచవితి రోజునే లభించే తుమ్మి కూరతో చేసిన పప్పు నంజుకుని తింటే బావుంటుంది.

## తుమ్మి కూర పప్పు

కావాల్సినవి: తుమ్మి కూర, పెసరపప్పు, కొత్త చింతకాయలు, పచ్చిమిరపకాయలు, ఉప్పు.

**తయారుచేసేవిధానం:** తుమ్మి కూరను శుభ్రం చేసి బాగా కడిగి తరగాలి. చింతకాయలు, పచ్చిమిరపకాయలు కలిపి దంచాలి. దానిలో ఉప్పు కలపాలి. పెసరపప్పును శుభ్రం చేసుకొని కడిగి, ఉడికించి, తుమ్మి కూరను అందులో కలిపి, ఉడికిన తర్వాత, దంచిన కారాన్ని కలపాలి. ఉండ్రాళ్లకు, తుమ్మి కూర పప్పు జోడీ భలే రుచిగా వుంటుంది. ఇవి సులభంగా జీర్ణమవుతాయి. ఎక్కువ తిన్నా ఏమవదంటారుమరి.

## వెజిటబుల్ ఛాప్స్

**కావలసిన పదార్థాలు**
ఉడికించిన నూడుల్స్- 200 గ్రాములు, సన్నగా కట్ చేసిన క్యారెట్ ముక్కలు- 1/2 కప్పు, సన్నని క్యాప్సికం ముక్కలు- 1/2 కప్పు, సన్నలి ఉల్లి ముక్కలు- 1/2 కప్పు, సన్నగా తరిగిన క్యాబేజీ ముక్కలు- 1 కప్పు, వెల్లుల్లి ముక్కలు- 2 చెంచాలు, సోయాసాస్- 1 /2 చెంచా, ఉప్పు - తగినంత, కార్న్‌ఫ్లోర్- 3 చెంచాలు, పంచదార ఇష్టమైతే- 1/2 చెంచా, నూనె- నూడుల్స్ వేపడానికి సరిపడ

**తయారు చేసే విధానం**

ముందుగా వెనిగార్, సోయాసాస్, పంచదార, ఉప్పు, కార్న్‌ఫ్లోర్‌ని ఒక బౌల్‌లో వేసి సరిపడ నీరు పోసి ఒక కప్పు మిశ్రమం అయ్యే విధంగా తయారు చేసి పక్కన పెట్టాలి. ముందుగా పాన్‌లో 3 చెంచాల నూనె వేసి ఉల్లిముక్కలు, వెల్లుల్లి ముక్కలు వేసి దోరగా వేపుకోవాలి. తరువాత క్యాబేజీ, క్యారెట్, క్యాప్సికమ్ వేసి మీడియం మంటమీద రెండు నిమిషాలు వేపాలి. ఇప్పుడు వీటికి తయారు చేసుకున్న వెనిగార్ తదితర మిశ్రమాన్ని జతచేసి బాగా కలుపుతూ రెండు నిమిషాలు ఉడికించి దించి పక్కన పెట్టుకోవాలి. ఉడికించి వార్చిన నూడుల్స్ మీద చల్లటి నీరు పోసి బాగా వడకట్టి కొద్దిగా ఆరనివ్వాలి. వీటిని నిండునూనెలో ఎర్రగా వేపుకొని పేపర్ మీద పోసుకోవాలి. దాని వల్ల అధికంగా ఉన్న నూనెను పేపర్ పీల్చి వేస్తుంది. సర్వింగ్ ప్లేట్లలో నూడిల్స్ సరిపడ పెట్టి పైన ఈ వెజిటబుల్ మిశ్రమాన్ని వేసి వేడిగా సర్వ్ చేయాలి.



## బాలనేస్తం

# అంత ముఖ్యమైనది ఏంటబ్బా...

**నే**స్తాలూ...!

ఈ కేక్ చూస్తోంటే నోరూరి పోతోందా? మాక్కూడా సేమ్ ఫీలింగ్. అయితే మేం ఒక ప్రశ్న వేస్తాం. దానికి సమాధానం చిటికెలో చెప్పాలిమరి. రెడీనా. కేక్‌లో అవి లేకపోతే పుట్టినరోజు జరుపుకునే వీలే వుండదు. ఇంతకీ అంత ముఖ్యమైనవి ఏంటబ్బా అవి? కింద కొన్ని ఆధారాలున్నాయి. అంటే కొన్ని ఆకారాలకు ముందర ఆంగ్ల అక్షరాలున్నాయి. మీరు వీటిని పైన కేక్‌లో ఇచ్చిన ఆకారాల క్రమంలో పెట్టండి. జవాబేంటో తెల్సిపోతుంది. మరి ఆలస్యమెందుకంట! చివరికి మా సమాధానంతో మీ ఆన్సర్ సరిచూసుకోండే.

జవాబు: candles



# నీడ ఏది?

S
a
c
o
t
p

# జత చేసేద్దాం

**బు**జ్జాయిలూ...

ఇక్కడ కొన్ని ప్రాణులు, వస్తువులు వున్నాయికదా. వాటికెదురుగా కొన్ని ఆంగ్ల అక్షరాలున్నాయి. అవేంటో కాదు. మీకు కనిపిస్తున్న బొమ్మల పేర్లకు తొలి అక్షరాలే. మరి ఏ బొమ్మకు ఏ అక్షరమో జత చేసేయండి.



# దారి కనిపెడద

# శాంతా టోపీ ఏదోచ్

శాంతాక్లజ్ ఎదురుగా కొన్ని టోపీలు, ఆటవస్తువులు వున్నాయికదా. ఇంతకీ శాంతా టోపీ ఏది? దాన్ని గుర్తించి సున్నా చుట్టండే.



# చిన్నారి చిత్రకారులు

**ఎ. రాకేష్,** 7వ తరగతి,
జడ్.పి.ఎస్.ఎస్. స్కూల్, చేర్యాల, వరంగల్.



**హెచ్. సతీష్,** 5వ తరగతి,
ఎం.పి.పి. స్కూల్,
నందిగామ,
కృష్ణా జిల్లా.



**ఎన్. వెంకట బాలమురళీ కృష్ణ,**
3వ తరగతి,
పెద్దాపురం.

# చక్కటి చిత్రం చేయగలరా!






**చి**న్నారులూ... మా ఇంట్లో ఓ పిడుగు వున్నాడు. వాడు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. ఇదిగో చక్కటి ఫొటోని ఇలా కత్తిరించిపారేశాడు. మీరేం చేయాలంటే... వీటన్నిటినీ చక్కగా కిందవున్న బాక్స్‌లో అతికించాలి. మరి ఆ పనిలో వుండండీ.

పీపీ

బహుశా పురాణాల్లోని ఏ దేవుని కన్నా ఎక్కువగా వినాయకుడు ప్రజా జీవితంలో పాతుకు పోయాడు. ఆధునిక సమాజంలోనూ అనేక విధాల ప్రస్తావనకు వస్తూనే వున్నాడు. వినాయకుడికి విఘ్నేశ్వరుడు అన్న పేరుతో పాటు గణపతి, గణేశుడు అని కూడా పేర్లు. తొండము నేక దంతము తోరపు బొజ్జయు వామహస్తమున్.. అని వినాయకుడిని కీర్తిస్తారు. అనేకదంతం భక్తానాం. ఏక దంత ముపాస్మహే అన్న ఘంటసాల గానం వీనుల విందు చేస్తుంది. చదువుల వేల్పుగా పూజలందుకునే వినాయకుడు వాస్తవానికి వ్యవసాయంతోనూ ముడిపడి వున్నవాడే. ఇలాంటి మరెన్నో విశేషాలు మీ కోసం ఈ వారం ప్రత్యేకంగా ఇస్తున్నాం....

# గాథానిలయుడు గజముఖుడు

వినాయకుడి ఏనుగు తల, ఎలుక వాహనం ప్రత్యేకతలు. అంత స్థూలకాయుడు ఎలుక పిల్లపై వూరేగడం ఒక విచిత్రమైతే లంబోదరం అనబడే ఆయన బాన పొట్ట మరో విచిత్రం. వాస్తవానికి ఇవన్నీ పంటలకూ ఆహారానికి సంకేతాలే. ఆయన పేర్లలో చాలా వాటికి పంటల దేవుడని అర్థం వస్తుంది. శూర్పకర్ణ అంటే చేటంత చెవులున్నవాడు ఈ చెవులు తూర్పారబట్టే ధాన్యాన్ని సూచిస్తాయి.

ఏకదంతం నాగలికి ప్రతీక. ఆయనకు పెట్టే ఉండ్రాళ్లు, కుడుములు పంటల నుంచే వస్తాయి. లంబోదరం అన్నది ధాన్యపు గాదెకు, నవృద్ధికి చిహ్నమని చెబుతారు. దాని చుట్టూ సర్పాన్ని బిగిస్తారు. ఎలుక వాహనం దిగువన వుంటుంది. అంటే ఎలుకలను చంపే పాముకు వ్యవసాయంలో విశేషమైన ప్రాధాన్యత వుంటుంది. వినాయకుడిని మట్టితో చేసి నిమజ్జనం చేయడంలోనూ ఇదే కన్పిస్తుంది. ఇక నిమజ్జనం తర్వాత కూడా అక్కడి ఇసుకనో, బంక మన్నునో తీసుకువెళ్లి గాదెలున్న గదుల్లోనూ సరుకుల గోదాముల్లోనూ తీసి పెట్టుకుంటారట. ఇది యూరప్‌లోనూ జరుగుతోంది (దేశ దేశాల్లో వినాయకుడి విశేషాలు మరోచోట చూడొచ్చు). ఇవన్నీ కాక వినాయక చవితి పండుగ వర్షరుతువు ప్రారంభంలో వస్తుంది. వినాయకుడికి సిద్ధి, వృద్ధి అని ఇద్దరు భార్యలుంటారు. సిద్ధి అంటే విజయం సాఫల్యం అని అర్థం. వృద్ధి అంటే సమృద్ధి అభివృద్ధి. అని అర్థం. వ్యవసాయానికి విఘ్నాలు లేకుండా రాకుండా వుండేందుకు ఆయనను పూజించడం మొదలెట్టారు. వినాయకుడికి సమర్పించే పత్రి కూడా ప్రకృతిలో లభించే అనేక ఔషధ మూలికల పత్రాల కలయిక. చెరకు గడలు, రేగు పండ్లు, అప్పడాలు, తేనె, జున్ను, బాలాజ్యము, ఆను బియ్యము, పటికె బెల్లం, అటుకులు వంటివన్నీ ఆయనకు నైవేద్యంగా పెట్టాలంటారు.

ఎన్ని గాథలో....

వినాయకుడి విగ్రహాన్ని మట్టితో



## సాగర కాలుష్యం!

మత పరమైన ఉద్రిక్తతలకు తోడు పర్యావరణ కాలుష్యం కూడా హైదరాబాదుకు పెద్ద సమస్యగా తయారైంది. నగరంలో విగ్రహాల నిమజ్జనం హుస్సేన్ సాగర్‌లోనే జరగాలని నిర్వాహకులు పట్టుపడుతుంటారు. అసలే కాలుష్య కాసారమైన హుస్సేన్ సాగర్‌లో రకరకాల రసాయనాలు ఉపయోగించి తయారు చేసిన భారీ గణేశ విగ్రహాలను ఒక్కుమ్మడిగా నిమజ్జనం చేయడంతో అది మరింత కలుషితమై పోతున్నది. పైగా ఆచార ప్రకారం విగ్రహాలు కరిగిపోవడమూ లేదు. మట్టితోనే విగ్రహాలను చేస్తే ఈ సమస్య వుండదని పర్యావరణ సంస్థలు ఎంతగా చెప్పినా ఉన్నత న్యాయస్థానాలు కూడా ఆదేశించినా.మత శక్తుల కుటిల వ్యూహాలు ప్రభుత్వాల అవకాశవాదాల వల్ల సమస్య కొనసాగుతూనే వుంది.




చేయడంలోనూ నీటిలో కలపడంలోనూ ఇదే అర్థం వుంది. ని-మజ్జనం అంటేనే నిశ్శేషంగా కలిపేయడం (మజ్జిగ అంటే బాగా చిలికిందని తెలుసు కదా). కాని ఇప్పుడు నీటిలో కలవని రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి పదార్థాలు వాడటంతో వినాయక నిమజ్జనం ప్రహసనంగా మారిపోయింది.చివరకు ఇది వాతావరణ కాలుష్య కారకంగా మారిపోవడం విచారకరమైన వాస్తవం.

మరోసారి మనం వెనక్కు వెళ్తే వినాయకుడి గురించి బోలెడు కథలున్నాయి. 'శివ శివ మూర్తివి గణనాథ నీవు శివుని కుమారుడవు గణనాథ' అని పాడతారు గాని నిజానికి ఆయన పార్వతీ తనయుడని ప్రతీతి. స్నానం చేసేప్పుడు నలుగు పిండితో ఆమె ఆయనను తయారు చేసి ద్వారం దగ్గర కాపలా పెట్టిందని, తర్వాత వచ్చిన ఈశ్వరుణ్ని అడ్డుకుంటే ఆయన ఆగ్రహించి తల నరికేశాడన్నది ప్రసిద్ధ కథ. పార్వతి వచ్చి శోకిస్తే ప్రమథ గణాలను పంపించి ఏనుగు తల తెప్పించి అతికించాడని చెబుతారు. ఇందులో మనకు మాతృస్వామిక సమాజపు ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది.

ఇది గాక దేవనాగరి లిపిలోని ఓంకారమే వినాయకుడి రూపం దాల్చిందనేది మరో కథ. నిజంగానే ఆ రూపం ఓంకారాన్ని పోలి వుంటుంది! శివ శక్తిని పదార్థానికి శక్తికి సంకేతంగా పరిగణిస్తారు. వారిరువురి సంయోగం వల్ల ఓంకారం పుట్టిందంటారు. అదే గణేశుడు. దాంతో పాటే వెలుగు కలుగుతుంది. శబ్దానికి కూడా ఆయన సంకేతం. క్రైస్తవ మత గ్రంథాల్లో ఆదిలో వక్తముండెను అంటారు. వీటన్నిటినీ సమాజ పరిణామ దృష్టితో అర్థం చేసుకోవచ్చు. వైష్ణవం కంటే శైవం ప్రాచీనమైంది. శివుడు అనార్య అనాది దేవుడు. ఆది దేవుడు. చర్మాంబర ధారి. శ్మశాన వాసి. కపాల కుండల ధారి. అలాటి శివుడికి కుమారుడుగా చెప్పబడే వినాయకుడు ప్రమథ గణాలకూ నాయకుడు కావడం యాదృచ్ఛికం కాదు. రుగ్వేదంలోనే గణపతి ప్రస్తావన కనిపిస్తుంది. ఈ పదం ఇప్పుడు పూజలందుకునే వినాయకుడు కాకపోయినా గణ నాయకుడి ప్రాధాన్యతకు మాత్రం నిదర్శనం.వివిధ శాస్త్ర గ్రంథాలు వివిధ రకాల వినాయకులను పేర్కొంటున్నాయి. మానవ గృహ్య సూత్రంలో నలుగురు వినాయకుల ప్రస్తావన వుంది. దేవ యజన, కుసుమ రాజపుత్ర, అస్మిత, శాలకటంకట వినాయకుల పేర్లు వీటిలో కనిపిస్తాయి. బోధాయన గృహ్య సూత్రాలను చూస్తే ఏకదంత, లంబోదర, హస్తిముఖ, విఘ్న అనే వినాయకుల నామాలు కనిపిస్తాయి. యాజ్ఞవల్క్య స్మృతి వినాయకుడిని గణనాయకుడిగానే పేర్కొంది. క్రీపూ 2వ శతాబ్దిలోనే అమరావతి స్థూపం దగ్గర గణపతి తొలి ప్రతిమ లభించింది. అంటే అప్పటికే గణేషారాధన వుందన్నమాట. గుప్తుల కాలం నాటి శివాలయంలోని గణపతిని చూస్తే గజముఖం గల స్త్రీ రూపం కూడా వుంటుంది. శ్రీశైల ప్రాకార కుడ్యాల మీద గణపతి అంకపాలి మీదున్న శక్తి మర్మస్థానాన్ని తన గజ హస్తంతో స్పృశిస్తుం టాడు. ఇది తాంత్రికుల ప్రభావం అంటారు గాని దీనంతటి లోనూ మనకు మాతృస్వామికం ఛాయలు కనిపిస్తాయి.ఇలాంటి శక్తి ప్రతిమలే మనకు తిరుపతి, శ్రీకాళహస్తి ఆలయాల్లోనూ అగుపిస్తాయి.

మనం ఇప్పుడు పూజిస్తున్న వినాయ కుడి మూర్తి క్రీశ ఆరవ శతాబ్ది నుంచి ప్రాచుర్యంలోకి వచ్చింది. అంత క్రితం శతాబ్దిలోనే నాట్యగణపతి విగ్రహాలు కూడా వెలిశాయి. ఏడో శతాబ్ది నాటి కూడలి సంగమేశ్వరాలయంలో నాట్యగణపతిని తొలి గణపతి అంటారు. సప్త మాతృకలతో కలసి వినాయకుడు నాట్యం చేస్తున్న విగ్రహం ఒకటి రాజస్థాన్‌లో కనిపిస్తుంది. క్రీశ, 12 వ శతాబ్ది నాటి శిల్పంలో గణపతి సమర కౌశలంలోనూ ఆరితేరిన వాడుగా కనిపిస్తాడు. 15వ శతాబ్దినాటి శ్రీశైల శిల్పంలో వినాయకుడు మహాశివుని నాట్యానికి మృదంగ సహకారం అందించిన దృశ్యం చెక్కబడింది. ఆ విధంగా విద్యలోనే గాక సంగీత సాహిత్యాల్లోనూ ఆయన సిద్ధహస్తుడే.

**వినాయకుడి పెళ్లికి వెయ్యి విఘ్నాలు**

వినాయకుడికి సిద్ధి,వృద్ధి అనే ఇద్దరు భార్యలుండటం వెనకా పెద్ద కథ. వాస్తవానికి

# వినాయక విగ్రహాల వింతలు



ఆధునిక కాలంలో వినాయకుడి విగ్రహం డిజైనింగ్‌లో ఒక ప్రత్యేకాకర్షణగా మారింది. ఫోటోగ్రాఫర్లనే వారు గజముఖుణ్ణి సృజనాత్మకంగా చిత్రించడంలో పోటీపడుతున్నారు. పైగా ఏ అద్భుత చిత్రం చూసినా ముందు ఆ మూర్తి తప్పని సరి కావడంతో వివిధ నమూనాలలో గణపతి కనిపిస్తున్నాడు. ఫ్యాషన్లలోనూ వాస్తు.అదృష్టం వంటి విశ్వాసాలలోనూ వినాయకుడిని ధరించడం తప్పనిసరై పోవడంతో వాణిజ్య ప్రపంచం విజృంభించింది. కీచెయిన్, వాల్ పెయింటింగ్, టీ షర్ట్, స్టిక్కర్, పెన్ క్యాప్ ఇలా ప్రతిదానిపైనా వినాయకుడే! ఆ మొహం, ఆ పొట్ట ఎవరు ఎలా రూపొందించినా ముచ్చట గొల్పుతుండటంలో డిజైనింగ్‌లో వినాయకుడికి ఎదురు లేకుండా పోయింది. గణపతి రూపాల సృష్టిలో చైనాది పై చేయి. అక్కడి షెన్‌జెన్ నుంచి వినాయకుడి వినూత్న రూపాలు విశ్వ వ్యాపితం అవుతున్నాయి. చైనా గణపతులు ఆసియా ఐరోపా ఆఫ్రికా అమెరికాలలో విహరిస్తున్నారు. కొరియా సింగపూర్ మలేషియా నేపాల్ మెక్సికో జపాన్ కెనడా వంటిదేశాలలో గిఫ్ట్ మార్కెట్లలో గణపతిదే ఆధిక్యత. ఏ మూల చూసినా వినాయకుడి విగ్రహాలు తయారయ్యే భారత దేశంలో కూడా చైనానుంచి వచ్చిన నమూనాలు నిండిపోతున్నాయి. పైగా ఐరోపాకు ఎగుమతి చేసేవాటిలో కన్నా ఇండియాకు పంపించే వాటిలో భక్తి భావన అధికంగా వుండేలా జాగ్రత్తతీసుకోవడం విశేషం. అంతర్జాతీయ నగల మార్కెట్‌లోనూ గణపతి హవా సాగుతున్నది. ఇంగ్లాండ్, స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాలలోని ప్రసిద్ధ సంస్థలు గణపతి డిజైన్లతో ఆభరణాలు చేసి లాభాలు పండించుకుంటున్నాయి. మట్టి నుంచి బంగారం వరకూ దేనితో చేసినా ఆకర్షణీయంగా కనిపించే వినాయకుడి అందచందాలే ఇంతటి అమోఘ విజయానికి కారణమని వేరే చెప్పాలా?

ఆయన చాలా కాలం బ్రహ్మచారిగానే వుండేవాడు. ఒకసారి పిల్లిని గాయపర్చాడట. ఇంటికి వెళ్లి చూస్తే తల్లి పార్వతి కాయంపై గాయాలు కనిపించాయి. ఏమంటే అన్ని ప్రాణులలోనూ నేనున్నానని చెప్పింది. దాంతో వినాయకుడు ఎవరినీ చేసుకోకుండా వుండిపోయాడు. తర్వాత ఎప్పుడో ఈ ఇద్దరిని పెళ్లాడాడు. దానికి కూడా బోలెడు చిక్కులొచ్చాయి. వినాయకుడి పెళ్లికి వేయి విఘ్నాలన్న మాట అలా పుట్టింది. అందరూ విఘ్నాల తొలగింపుకోసం పూజించే వినాయకుడి పెళ్లికే ఆటంకాలు రావడం ఇక్కడ చమత్కారం.

మన దేవీ దేవతా విగ్రహాలన్నీ ఆదిమ తెగల జీవన విధానంలోంచి వచ్చాయంటాడు డి.డి.కోశాంబి. దశావతారాల్లో ముఖ్యమైన తాబేలు, చేప, వరాహం వగైరాలన్నీ ఆయా తెగల గుర్తులు. వాటి మధ్య సర్దుబాట్లు సంకరాలు జరిగినకొద్దీ వాటన్నిటినీ విష్ణువు అవతారాల్లో చేర్చుతూ పోయారు. ఒక తెగ మరో తెగతో కలసి పోయినా లేదా దాని ఆధిపత్యాన్ని అంగీకరించినా రెండింటికి సంబంధించిన గుర్తులను కలిపేస్తారు. ఉదాహరణకు పాము శివుడి మెడలో వుండటం, వినాయకుడి ఆయుధం కావడం ఇలాంటి ఉదాహరణలే. గణేశుడు శివుడి కుమారుడై పోవడం కూడా ఇందులో భాగమే. అప్పుడు పాము ఈశ్వరుడి మెడలో చేరింది. అంతేగాక వినాయకుడు ఈశ్వరుడి అనుచరులైన ప్రమథ గణాలకు నాయకుడైనాడు. నంది శివుని వాహనమైంది. ఎలుక వినాయకుడి వాహనం అయిందంటే ఆ గుర్తుగల తెగ ఏనుగు గుర్తు గల తెగకు లోబడిపోయిందన్న మాట. వివిధ రకాల ఆచారాలను కలగలుపుకోవడం ఇక్కడ మనం చూస్తాం. ఇప్పుడు వినాయకుడి ఉత్సవాలను మత కలహాలకు సాకులుగా ఉపయోగిస్తున్నారు గాని ఆయన పుట్టుక మాత్రం విభిన్న తెగల కలయికకు సంకేతంగా రూపొందింది. గణపతి అన్న పేరులోనే ఆదిమ గణాల సూచన వుంది. ఉత్తర భారతంలోని వ్యవసాయ ప్రధాన కులమైన జాట్లకు ఇప్పటికీ వినాయకుడే ప్రధాన దైవం.

'కోరిన విద్యల కెల్ల నొజ్జవై వుండెడి ఓయి గణాధిపా నీకు మొక్కెదన్' అని పాడుతున్నట్టు వినాయకుడు విద్యల మూలంగా కొలవబడతాడు. ఆయన విద్యలకు నాయకుడు. వ్యాసుడు మహాభారతం రాసేప్పుడు వినాయకుడు ఊహ తెలియగల లేఖకోత్తముడుగా సహాయపడ్డాడు (శ్రీశైలం సమీపంలోని ఒక వినాయకుడి ఆలయంలోని విగ్రహాన్ని సాక్షి గణపతి అంటారు. దాని చేతిలో ఘంటం వుంటుంది). అలా రాసేప్పుడువినాయకుడి ఘంటం విరిగిపోయిందట. ఆయన తన తొండాన్ని విరిచి కలంగా ఉపయోగించి రాశాడని కథ. పరుశురాముడు ఈశ్వరుణ్ని చూసేందుకు వస్తే గణపతి అడ్డుకోగా కోపగించి గండ్రగొడ్డలితో ఒక దంతాన్ని నరికేశాడని మరో కథ. చంద్రుడు తనను చూసి నవ్వాడనే కోపంతో వినాయకుడే దంతాన్ని తెంపేసుకున్నాడని ఇంకో కథ. ఇలా ఆయన ఏక దంతం చుట్టూ అనేక కథలు!

మొత్తంపైన ఈ కథలన్నీ కూడా పౌరాణికంగా శివ పార్వతులతోనూ సామాజికంగా వ్యవసాయ విద్యాబుద్ధులతోనూ ముడివడి వుండటం గమనించదగ్గ విషయం. హాస్య రస సామ్రాట్టుగా కనిపించే వినాయకుడు వాస్తవానికి సమాజ జీవితంలో ఎంతో ప్రాముఖ్యత గల వాడని వీటన్నిటినిబట్టి మనకు అర్థమవుతుంది. ఇంతేగాక నాటి నుంచి నేటి వరకూ జాతీయ



జీవనంలోనూ వినాయక వుత్సవాలకు ఎంతో ప్రాధాన్యత వుంది. మరే పండుగకు జరగని విధంగా వినాయకుడి విషయంలో మాత్రమే విగ్రహాలను ఇంటింటా అమర్చుకుని వ్యవధి ముగిసిన తర్వాత నిమజ్జనం చేస్తారు. బాగా పురాతన కాలంలో అగ్రవర్ణ బ్రాహ్మణుల ఇళ్లలో తప్ప కింది కులాల వారు ఇళ్లలో విగ్రహాలను వుంచుకోకూడదు (వారికోసం గుళ్లూ గోపురాలూ వెలశాయి. వాటిలోకి కూడా రాని వ్వకుండా ఆంక్షలూ వచ్చాయి). కనకనే వాటిని తప్పక నిమజ్జనం చేయాలి. అయితే అంత వరకూ పూజించడానికి విగ్రహాలు కావాలి కనక వాటికి ఎంతో గిరాకీ.

❋

## ఆధునిక చరిత్రలో వినాయకుడు

అలనాటి పురాణాలలోనే గాక ఆధునిక భారత దేశ చరిత్రలోనూ వినాయకుడితో ముడిపడిన పరిణామాలు మనం చూస్తాం. స్వాతంత్ర్య పోరాట కాలంలో తిలక్ మహాశయుడు గణేశ ఉత్సవాల ద్వారా దేశభక్తి పెంపొందించేందుకు ప్రయత్నించాడు. కాని స్వాతంత్ర్యానంతర కాలంలో క్రమేణా ఈ ఉత్సవాలు మతపరమైన ఉద్రిక్తలకు కారణమవుతున్నాయి. తిలక్ వాటిని ఉదాత్తంగా నిర్వహించిన ముంబాయిలోనే శివసేన ఆధ్వర్యంలో పూర్తిగా దారి తప్పిపోయాయి. మతతత్వ శక్తులు, మాఫియాలు వాటిని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించి మంటలు పెట్టాయి. ఇదే ధోరణి తర్వాత కాలంలో హైదరాబాద్‌తో సహా ఇతర ప్రాంతాలకూ పాకింది.

గత ఇరవై ఏళ్లలోనూ హైదరాబాదులో గణేశ ఉత్సవాలను సంఘ పరివార్ శక్తులు ఉద్రిక్తతకు సాధనంగా చేసుకుంటున్నాయి. చాలా కాలం ముందు నుంచి సంఘ వ్యతిరేకులు చందాలు పోగుచేసి హంగామాగా విగ్రహాలు ఏర్పాటు చేయడం. అన్నిటినీ ఒకేసారి ఊరేగింపుగా తీసుకెళ్లడం ద్వారా ఉద్రిక్తత పెంచడం జరుగుతున్నది. ఆనందోత్సాహాలతో జరగాల్సిన ఈ ఉత్సవాలు చివరకు మత కలహాలకు దారి తీయడంతో జనం బిక్కు బిక్కుమంటూ గడపాల్సిన స్థితి. ఎంవి కృష్ణారావు కమీషన్ హైదరాబాద్‌లో గణేష నిమజ్జన ఉత్సవాలు ఏ విధంగా ఉద్రిక్తతకు దారి తీస్తున్నాయో వివరంగా నివేదించింది. కాని ఇప్పటికీ ఆ పరిస్థితిలో పెద్ద మార్పులేదు.

## విదేశీ వినాయక విశేషాలు...

❖ భారతీయ సంస్కృతి, ఆచారాలు అని అదే పనిగా చెబుతుంటారు గాని నిజానికి అన్ని దేశాలలోనూ అనేక విశ్వాసాలు వుమ్మడిగా వుంటాయి. పోలికలూ వుంటాయి. అచ్చమైన భారతీయ దేవుడుగా కనిపించే వినాయకుడికి కూడా విదేశాల్లో డూపులు లేకపోలేదు. చైనా నుంచి ఉత్తర అమెరికా వరకూ అన్ని చోట్లా ఇలాంటి దేవతా రూపాలు దాదాపు వంద వరకూ కనిపిస్తాయి. అలాగే హిందూ మతంలోనే గాక ఇతర మతాలలోనూ వినాయకుడి ప్రతిరూపాలు వున్నాయి.

❖ జపాన్‌లోని గణేశుడిని షోడెయిన్ అని పిలుస్తారు. జపాన్‌లోని చాలా దేవాలయ ద్వారాలపై గజముఖ దేవుడుంటాడు.ఈ దేవతలు పొడవైన వస్త్రాలు ధరించి కౌగిలించుకుని వుంటాయి. జపాన్ బౌద్ధ సాహిత్యంలో గణేశుడు చెడును సంహరించే దేవుడుగా కీర్తించబడతాడు.

❖ చైనాలో గణేశుణ్ణి కాంగ్షి షెన్ అంటారు.ఇక్కడ కూడా జపాన్‌లో వలెనే గజ ముఖదేవతలు పరస్పరం ఆలింగనం చేసుకుని వుండటం చూస్తాం. 11 వ శతాబ్ది వరకూ కూడా తాంత్రికులు ఈ విగ్రహాలను పూజించేవారట. మన వినాయక విగ్రహం వంటిది కూడా చైనాలో కనిపించింది. లాఫింగ్ బుద్ధగా ప్రసిద్ధమైన విగ్రహంలోనూ వినాయకుడి ఆనవాళ్లున్నాయంటారు చరిత్ర పరిశోధకులు.

❖ మెక్సికోలో ఈ రోజుకూ మూలజాతి అమెరికన్లు (రెడ్ ఇండియన్స్) ఏనుగు తల వున్న దేవుణ్ణి పూజిస్తారు. ఏజ్టెక్ అనే పురాతన దైవం గణేశుణ్ణి పోలి వుంటాడు.

❖ గ్రీకు పురాణాలలో జానూస్ అనే దేవుడికి గజముఖం వుంటుంది. ఈయన పేరుటనే జనవరి నెల పుట్టింది. ఈయనను కూడా ఏదైనా శుభకార్యం ప్రారంభంలో పూజిస్తారు.

❖ దక్షిణఅమెరికాలో ప్రాచీన మాయా సంస్కృతిలో గజముఖ దేవుడుంటాడు.

❖ ఉత్తర అమెరికాలో రెడ్ ఇండియన్లు ఇలాంటి దేవుడినే పూజిస్తారు.

❖ ఆగ్నేయాసియా దేశాలన్నిటా గణేశ్ పూజా విధానం కనిపిస్తుంది. ఆఫ్ఘనిస్తాన్, వియత్నాం, కంబోడియా, మయన్మార్, అన్నిచోట్లా ఇలాంటి విగ్రహాలు విశ్వాసాలు వున్నాయి. ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్ సమీపంలోనూ ఇంకా అనేక చోట్ల గణేశ విగ్రహాలు దొరికాయి. ఇక ఇండియా నుంచి విభజించబడిన పాకిస్తాన్,బంగ్లాదేశ్‌లు సరే సరి.

❖ కంబోడియాలోనైతే ఆంగోకోర్ శకంలో ఇసుక రాతిపై కూచున్న ట్వాల్ ఫేక్ కిన్ అనే గణేశాకార విగ్రహాలు దొరికాయి. ఇక్కడ దొరికిన అనేక విగ్రహాలను దాన్ని వలసగా పాలించిన ఫ్రాన్స్ మ్యూజియంలో భద్ర పర్చారు. వియత్నాంలోనూ అంతే. వీరు వినాయకుడిని విఘ్నేశ అని కూడా పిలవడం విశేషం.

❖ మయన్మార్(బర్మా)లో వినాయకుడిని మహాపిన్నెగా ఆరాధిస్తారు.

❖ శ్రీలంకలో మొదటి శతాబ్దం నాటి వినాయక విగ్రహాలు లభించాయి.

❖ .థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో వరల్డ్ ట్రేడ్‌సెంటర్ దగ్గర ఉన్నతాసనారూఢుడైన గణేశుడు కనిపిస్తాడు.

❖ ప్రపంచంలో ముస్లిం జనాభా ఎక్కువగా గల ఇండోనేషియాలో వినాయకుడు వేయి రూపాయి నోట్లపైన దర్శనమిస్తాడు.


కంబోడియా గణేష్


కాబూల్ గణేష్


ఖజరహోలో గణేష్

కథ

శైలి

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం

# కథాగానం

ఇక వెంకట్రావు అక్కడ ఓ క్షణం కూడా నిలబడలేకపోయాడు. అమ్మమ్మ మంచినీళ్ళు తెచ్చి ఇస్తే రమ గట గట తాగి అక్కడే కింద కూలబడింది. అందర్నీ కూర్చోమంటూ చేతుల్తోనే సైగ చేసింది. ఒక్కొక్కరు నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు. మీకు మానాన్న చేసిన నేరం ఏమిటో తెలియదు. చెప్పడానికి ప్రయత్నిస్తాను. అందరూ సావధానంగా వినండి. ఆసక్తితో కొందరు ఆడవాళ్ళు రమ దగ్గరగా జరిగి కూర్చున్నారు. చిరుచెమటతో కలసిన నుదుటి మీద కుంకుమబొట్టు, ముడివిడి విరబోసిన జుట్టుతో. మఠం వేసుకుని నిటారుగా యోగినిలా కూర్చుంది. గట్టిగా శ్వాస ఎగబీలుస్తూ కథాగానం మొదలుపెట్టింది. చెప్పే నడకలో అప్పుడప్పుడు తెలియకుండా రాగం వస్తోంది.

రమ దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. ఆమెకు ఇప్పుడు పాతికేళ్ళు ఉంటాయి. పదేళ్ళ క్రితం వాళ్ళ అమ్మ చనిపోగానే ఇంటి నుండి పారిపోయింది. అసలు రమ బతికి ఉందో చనిపోయిందో తెలియని ఆ వృద్ధ దంపతులకు ఇప్పుడు ఆ ఉత్తరం గ్రీష్మంలో తొలకరి జల్లులా ఆనందాన్నిచ్చింది. ఆనంద భాష్పాలతో వాళ్ళ కళ్ళు చెమ్మగిల్లాయి.

"పూజ్యులైన అమ్మమ్మ తాతయ్యలకు నేను క్షేమం. మీరు క్షేమం అని భావిస్తున్నాను. ప్రస్తుతం నేను సికింద్రాబాద్‌లో 'విముక్తి' అనే స్వచ్ఛంద సేవా సంస్థలో పనిచేస్తున్నాను. అమ్మ దశమ ఆబ్దికం మీ సమక్షంలో జరుపుకుని అమ్మకు శ్రద్ధాంజలి ఘటించాలని కోరుకుంటున్నాను. రెండ్రోజులు ముందుగానే ఇంటికి వస్తాను. అయితే ఒక ప్రార్థన. నా కన్నతండ్రిని మాత్రం నేను చూడదలుచుకోలేదు. ఆ సమయంలో అతడు ఆ ఛాయలకు కూడా రాకూడదు. వస్తే నామనసు కకావికలం అవుతుంది. నేను మనస్ఫూర్తిగా గడపలేను.

ఇట్లు మీ మనుమరాలు

రమ

పదిహేను రోజుల తర్వాత రమ వచ్చింది. అచ్చం వాళ్ళమ్మ కళ్యాణిలాగానే ఉన్నది. కళ్యాణి మృదువుగా అణుకువగా ఉంటే రమ చురుకుగా దృఢంగా కన్పిస్తున్నది. రమలోని ఎదుగుదలకు అందరూ సంబరపడిపోతున్నారు. రమ అన్ని పనులను తానే స్వయంగా చేసుకుపోతుంది. ప్రతిదీ ముందుగా అమ్మమ్మ తాతయ్యలను సంప్రదించడం, తర్వాత తానే అన్నీ దగ్గరుండి చక్కపెట్టుకోవడం చేసేది. పురోహితుడిని మాట్లాడటం, ముత్తైదువలను ఆహ్వానించడం, ఇరుగుపొరుగు బంధుమిత్రులను పిలవడం, కావాల్సిన సరుకులు సరంజామాలు తెచ్చుకోవడం, వంటావార్పు వడ్డింపులు స్నేహితురాళ్ళతో జరిపించుకోవడం అన్నీ క్రమం తప్పకుండా చక్కగా జరిగిపోయాయి. ఇలా కొంత మందికి భోజన కార్యక్రమంతో పెద్ద ఆడంబరం లేకుండానే ఉన్నంతలో అమ్మ ఆబ్దికం కార్యక్రమం పూర్తి చేసుకున్నది.

రమ ద్వారా ఆత్మీయులందర్నీ ఈ విధంగా కలుసుకోవడం తమ కూతురు కళ్యాణి గురించి చెప్పుకోవడం, పనిలో పనిగా రమను అందరూ పొగుడ్తూ వుంటే ఆ ముసలి దంపతుల హృదయాలు ఆనందంతో ఉప్పొంగిపోయాయి. చివరిక్షణాల్లో రమ ఏది జరగకూడదని కోరుకుందో అదే జరిగింది. తండ్రి వెంకట్రావు అకస్మాత్తుగా పిడుగులా ఊడిపడ్డాడు. చింపిరిజుట్టు, మాసిన గడ్డం, నలిగిన బట్టలతో కొంత అసహ్యంగాను, కొంత జాలి గొలిపే విధంగాను ఉన్నాడు. అల్లుడు రాగానే అత్తమామలు యధాప్రకారం మర్యాదలు చేయడం ప్రారంభించారు.

'ఏం నాయనా' ఇంత ఆలస్యం అయిందేమి? ఉదయమే వస్తే బావుండేది గదా' అని నసిగింది అమ్మమ్మ.

'సరే అయిందేదో అయింది. వెళ్ళి స్నానం చేయి. భోంచేద్దువుగాని' అంటూ అనునయించాడు తాతయ్య. అంతే రమ ఒక్కసారిగా తోకతొక్కిన తాచులా రివ్వున లేచింది

'ఆగక్కడ'! ఆ స్వరంలో దెబ్బతిన్న పులి గాండ్రింపు ధ్వనించింది.

'ఈ ఇంట్లో నే ఉండగా ఇక్కడ నీకు స్థానం లేదు. నీవు గడపదాటి ఇంట్లోకి రావడానికి వీల్లేదు. వస్తే ఈ క్షణమే నేను ఇల్లు విడిచి వెళ్ళిపోతాను. వెంకట్రావు ఖంగుతిన్నాడు. నోట మాట లేదు. నీళ్ళు నములుతున్నాడు. వాతావరణం ఒక్కసారిగా నిశ్శబ్ద గంభీరానికి మారిపోయింది. బంధుగణం అంతా ఎక్కడికక్కడ స్థాణువులైపోయారు.

ఓ కన్న కూతుర్నుండి ఓ తండ్రికి ధిక్కారం, ప్రతిఘటన ఇంతటి తీవ్రస్థాయిలో ఉంటుందని ఎవ్వరూ ఊహించలేదు. చివరకు వెంకట్రావు కూడా. ఆ క్షణంలో రమని వారించడానికి అక్కడ ఎవ్వరికీ సాహసం లేక పోయింది. కన్న కూతుర్ని కళ్ళారా చూసుకుని కడుపారా మాట్లాడుకుందామని వచ్చిన వెంకట్రావు హతాశుడైపోయాడు. అలా అతడు మౌనంగా తిరిగి వెళ్తుంటే అక్కడి వారందరికి జాలివేసింది. రమలో రవ్వంత కనికరం కలగలేదు సరికదా... మళ్ళీ హెచ్చరించింది.

ఇదే మొదటిసారి చివరిసారి చెప్తున్నాను. ఇప్పుడే కాదు ఇక ఎప్పటికీ ఈ ఇంటికి రాకు. ఇది మా అమ్మకు జన్మనిచ్చిన ఇల్లు. దీన్ని ఇకనుండైనా పవిత్రంగా కాపాడుకుంటాను. నీలాంటి వాడి నీడ సోకటానికి కూడా వీల్లేదు"

'అదేంటమ్మాయి? అంత కటువుగా మాట్లాడతావు! ఎంతైనా నీకన్న తండ్రి గదా!"

ENTERED

బంధు గణంలోంచి ఓ గొంతు చిన్నగా లేచింది.

"పెద్దాచిన్నా లేకుండా ఏమిటా మాటలు. ఎంత పట్నంలో పనిచేస్తోంటే మాత్రం ఇంత అహంభావం పనికిరాదు" మరో గొంతు శృతి కలిపింది.

"ముసలివాళ్ళ ఆస్తిని కాజేయటానికే వచ్చినట్టుంది..."

"అందుకే ఇంత పొగరు..."

"అవును పొగరుతో ఎగిరెగిరి పడ్తోంది" గొంతులు శృతి మించుతున్నాయి.

అంతే రమ ఒక్కసారిగా పొలికేక పెట్టింది. "ఆపండి మీ వక్రభాష్యాలు. ఇంత క్రితమేగా నన్ను మా అమ్మను మీరంతా తెగ పొగిడారు. ఇప్పుడు మా నాన్నను బయటకు గెంటేసేటప్పటికి మీకంత కోపం వచ్చింది. చివరకు నన్ను ఆస్తి కాజేసే దొంగ మనిషిగా జమకట్టారు. సరే అమ్మమ్మ తాతయ్యల ఆస్తినంతా వారి తదనంతరం మా నాన్నకు తప్ప ఎవరికైనా రాసివ్వమను. నాకు చిల్లిగవ్వ అక్కర్లేదు.
కాని వారివురూ బ్రతికి వున్నంత వరకు అతను ఇక్కడికి రాకూడదు. వెలివేసిన మనిషిగా దూరంగా ఉండాల్సిందే. జీవితాంతం అలా బ్రతకాల్సిందే. అతడి పాపానికి ఇదే ప్రాయశ్చిత్తం. పశ్చాత్తాపం ఉన్నా సరిపోదు. ప్రాయశ్చిత్తం జరగాల్సిందే..." అంటూ రమ అపర కాళికాంబలా ఊగిపోయింది.

ఇక వెంకట్రావు అక్కడ ఓ క్షణం కూడా నిలబడలేకపోయాడు. అమ్మమ్మ మంచినీళ్ళు తెచ్చి ఇస్తే రమ గట గట తాగి అక్కడే కింద కూలబడింది. అందర్నీ కూర్చోమంటూ చేతుల్తోనే సైగ చేసింది. ఒక్కొక్కరు నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు. మీకు మానాన్న చేసిన నేరం ఏమిటో తెలియదు. అందరూ సావధానంగా వినండి. ఆసక్తితో కొందరు ఆడవాళ్ళు రమ దగ్గరగా జరిగి కూర్చున్నారు. చిరుచెమటతో కలసిన నుదుటి మీద కుంకుమ బొట్టు, ముడివిడి విరబోసిన జుట్టుతో, మఠం వేసుకుని నిటారుగా యోగినిలా కూర్చుంది. గట్టిగా శ్వాస ఎగబీలుస్తూ కథాగానం మొదలు పెట్టింది. చెప్పేనడకలో అప్పుడప్పుడు తెలియకుండా రాగం వస్తోంది.

అమ్మ చనిపోయిన దుఃఖం, నాన్న మీద ఉండే కసి, ద్వేషం కలగలిపి ఇప్పుడు రమను గతంలోకి నడిపిస్తున్నాయి. రమను తెలియని శక్తి ఏదో ఆవహించినట్లు కన్పిస్తుంది. 'మహారాజశ్రీ మల్లంపల్లి వెంకట్రావు అనే నా తండ్రి పౌరోహిత్యం చేస్తూ కాలం గడిపిన వ్యక్తిగా మీ అందరికీ తెలుసు. దేవాలయం అర్చనలు, వివాహ శుభకార్యాలు, శ్రాద్ధకర్మలు అన్నీ జరిపిస్తాడన్న విషయం కూడా మీకు తెలుసు. ఎక్కడెక్కడివారో వచ్చి మా తండ్రిని ఆ విధంగా తమ కార్యాలకు తీసుకుపోతూ ఉండేవారు. ఆ విధంగా ఆయనకు బయట ఎంతో గౌరవం, మర్యాద ఉండేవి కదా. అయితే ఇదంతా పైన పటారమే అమ్మలారా! లోపలి నలుపు నాకూ మా అమ్మకు మాత్రమే

తెలుసు.

నా తల్లి కళ్యాణి ఎలిమెంటరీ స్కూలు టీచరు గదా. నాతో సహా ఎంతో మంది పిల్లలకు చక్కని వినయం విద్యా బుద్ధులు నేర్పించిన మహాతల్లి ఆమె. ఆ తల్లిని చూస్తే చాలు ఎంతటి వారికైనా ఇట్టే గురుభావం కలుగుతుంది.

కాని ఈ త్రాష్టుడు అనే మానాన్న ఆమెకు పెట్టని నరకం లేదు నాయనలారా! రాత్రి అయితే చాలు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయం భయంగా బతకాల్సి వచ్చేది తల్లులారా!

తాగి రావడం లేదా ఇంట్లోనే తాగడం. ఈ గదిలో నుంచి ఆ గదిలోకి, ఆగదిలో నుంచి ఈ గదిలోకి ఈడ్చుకెళ్ళి నిష్కారణంగా ప్రతిరోజు కొట్టేవాడు.. ఇష్టం వచ్చినట్టు అపనిందలు వేస్తూ బూతులు తిట్టేవాడు. ఆ చిన్నప్పుడే నేను కాళ్ళా వేళ్ళా పడ్డా నన్ను వేరే గదిలో బంధించి అమ్మను చావబాదేవాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే గొడ్డును బాదినట్టు బాదేవాడు. అమ్మ ఏడుస్తూ వళ్ళు అప్పగించేది.

ఎప్పుడూ ఏ క్షణం ఎదురుతిరగలేదు. కనీసం ఇదేం అన్యాయం అని అడగలేదు. అమ్మలారా!

తెల్లవారేసరికి రాత్రి ఏం జరిగిందో ఎవరికీ ఏం తెలియనట్టు ఎవరి పనులకు వాళ్ళు వెళ్ళిపోయేవాళ్ళం. ఇంత ఘోరం జరుగుతున్నా తన భర్త గురించి బయట ఎవరితో పల్లెత్తి మాట చెప్పుకోలేని మహాతల్లి అమ్మలారా! అమ్మా నేను కూడా బయట ఎప్పుడూ ఈ విషయం మాట్లాడుకునే వాళ్ళం కాదు. దెబ్బల్ని చూసి ఎవరైనా అడిగితే మా మూగభాషలు బేలచూపులే వారికి సమాధానం చెప్పేవి. అంతులేని జాలి అమ్మపై ఉన్నా ఏమీ చేయలేకపోయేదాన్ని. అనేక రాత్రిళ్ళు పగళ్ళు అమ్మను కప్పలా కరుచుకుని బావురుమంటూ ఏడ్చేదాన్ని. అమ్మ ఈ దెబ్బలతో కృంగి కృశించిపోయింది. స్కూలు ఇల్లు తప్ప బయట వేరే ఇళ్ళకు వెళ్ళేది కాదు.

ఎప్పుడైనా ఎవరి ఇంటికైనా పేరంటానికి వెళ్ళినట్టు తెలిస్తే చాలు మరుసటి రోజు మంచానికి గొలుసులతో కట్టేసేవాడు. కుక్కకు పెట్టినట్టు పళ్ళెంలో అన్నం పెట్టి గ్లాసుతో నీళ్ళు ఇచ్చేవాడు. ఏమైనా కలుగజేసుకుంటే చంపేస్తానని నన్ను బెదిరించేవాడు. నేను భయంతో బిక్కు బిక్కు మంటూ వెళ్ళి ఓమూలన కూర్చునేదాన్ని. కిటికీ తలుపులు కూడా వేసి చీకట్లో మమ్మల్ని పడేసి ఇంటికి తాళం వేసుకుని బయటకు దర్జాగా వెళ్ళిపోయేవాడు.

ఆ దృశ్యం కళ్ళ ముందు మెదలాడుతున్నప్పుడల్లా నాలో నాగుబాము పగ బుసలు కొట్టేది. నేను పామై నా తండ్రిని వెంటాడి వెంటాడి నిలువునా కాటేసి చంపాలని అతగాడు నురగ కక్కుకుంటూ చస్తే కసిగా చూసి ఆనందించాలనే కోరిక పుట్టేది. ఏం చేయను మనిషైపోయాను. ఏడుస్తూ అమ్మకు అన్నం తినిపించేదాన్ని.

కాలక్రమేణా అమ్మ శుష్కించిపోయింది. బడికి సెలవులు ఎక్కువ పెట్టాల్సి వచ్చేది. కొద్ది రోజులకే క్షయవ్యాధి వచ్చింది. త్వరగా ముదిరింది. చూస్తూ చూస్తూ ఉండగానే పచ్చని చెట్టు ఎండిపోయినట్టు అమ్మ ఎండిపోయింది.

నా తండ్రి తాగుడుతోపాటు తిరుగుడు మరిగాడు. అప్పుడు మీరంతా ఏంమాట్లాడుకున్నారో నేను విన్లేదు అనుకున్నారా!

"కళ్యాణి రోగిష్టిదైతే ఏ మగాడైనా ఏం చేస్తాడు పాపం. అతడూ ఉప్పుకారం తింటున్నాడుగా!" అని దీర్ఘాలు తీస్తూ నోళ్ళు నొక్కుకోవడం, చెవులు కొరుక్కోవడం నాకు తెలియదనుకున్నారా? యధాస్థితికి వచ్చిందనుకున్న రమ కథాగానం నుండి ఇంక బయటకు రాలేదు. రాగాభినయం వేరుగానే ఉంది. బంధువులందరికి ఏం చేయాలో పాలుపోక బదిరాంధులైపోయారు. మళ్ళీ ఒక్కసారి శ్వాస ఎగబీల్చుకుని ప్రారంభించింది రమ

అప్పుడే నాకనిపించింది. మాఅమ్మ చచ్చిపోగానే ఏదో ఒకనాడు తాగొచ్చి నామీద పడి నన్ను కాటేయడని గ్యారంటీ ఏంటి? అరచేతిలో గుప్పెట పెట్టి గుద్దుతూ ప్రశ్నించింది. చెప్పండి మాట్లాడరేం?

నేనప్పుడే చెబితే నా మాటలు నమ్ముతారా? ఆ నమ్ముతారా మీరు. నమ్మరు. అందుకే ఎవరికి చెప్పకుండా పారిపోయాను. గూటి నుండి చిలక ఎగిరిపోయిందే పిల్లల్లారా.

ఇదిగో ఇప్పుడు వచ్చి ఈపనిచేశాను. మా అమ్మను పెట్టిన క్షోభకు మా తండ్రిని ప్రాయశ్చిత్తం కోరుతున్నాను. ఆజన్మాంతం అతడు కుటుంబం నుండి వెలివడి ఉండాల్సిందే. అప్పుడే మాఅమ్మ ఆత్మకు శాంతి. మృగాలకు మనుషుల్లో చోటు ఉండకూడదు. ఇదే ధర్మం, ఓం శాంతి, శాంతిః" అంటూ కథను ముగిస్తూ ముకుళిత హస్తాలు జోడించింది. అందరు లేచి నిలబడి శిరస్సు వంచి ప్రతినమస్కారం చేసారు.

❋

డా॥ జె.పి. వైద్య

# దర్దీ గీతాల జాదూగర్ ముకేష్!

-'కహీం దూర్ జబ్ దిన్ ఢల్ జాయే
చాంద్ సీ దుల్హన్ బదన్ చురాయే'
-'మైనే తెరే లియేహీ సాత్ రంగ్ కే సప్నేచునే'!
నేటికీ ఆ గీతాలను ఆత్మీయంగా 'గున్ గునాయించే వారు'
లక్షల్లో ఉన్నారు మరి!
ముకేష్ ఎన్ని వేల పాటలు పాడినా - పాటలో భావాన్ని
తాదాత్మ్యత చెందినట్టు, ఎంతో సుకువుగా, నేరుగా మనస్సుకు
హత్తుకునేట్టు పాడడం... అది ఆయన 'ఖాసియత్'- 'ప్రత్యేకతగా భావిస్తారు.
ముఖ్యంగా కంఠంలోని ఆర్థత, గుండెలోంచి పెగలుకొచ్చిన వ్యధ, బాధ, దుః
ఖం - హోల్ మొత్తం మీద ఆయన్ని ఒక అద్భుతమైన 'దర్దీ గీతాల
భావుకుడి'గా చరిత్రలో నిలబెట్టాయి.



**చ**రిత్ర....!

కొందరు చరిత్రను 'గత కాలపు ఆధారాలున్న రాజకీయాల ముచ్చట్లు' అని నిర్వచించారు. మహాకవి శ్రీశ్రీ లాంటి వారు 'ఏ జాతి చరిత్రను చూసినా ఏమున్నది గర్వ కారణం... నరజాతి చరిత్ర సమస్తం పర పీడన పరాయణత్వం' అన్నారు.

కొందరు చరిత్రలోని ఖాళీ పుటలే మానవాళికి మిగిలిన సుఖమయ క్షణాలు అని చెప్పుకున్నారు.

చరిత్రను సృష్టించిన మహానీయులకు నిజంగా ఆ పుటలను రాసే తీరికే లేదట!

హిందీ సినీ రంగం చరిత్రను ఎవరు, ఎప్పుడు, ఏ రకంగా రాసినా కొందరి పేర్లు సువర్ణాక్షరాలతో రాయక తప్పదు.

కొందరిని తలచుకోగానే దుఃఖం, విరహం, వేదన, బాధ లాంటి భావనలే స్ఫురిస్తాయి.

నటనతో కొందరు 'ట్రాజెడీ కింగ్'లూ కొందరు 'ట్రాజెడీ క్వీన్'లూ అయిపోయారు. సినీ చరిత్ర పుటల్లో సుస్థిర స్థానాన్ని పదిలం చేసుకున్నారు. అయితే కొందరి కంఠం మనసులను పిండేసి, హృదయంలో వేదనలను కదిలించి- దర్దీ గీతాల రారాజులుగా, విషాద గీతాల చక్రవర్తిలా, దర్దీ గీతాల షెహెన్‌షాలా నిలబెట్టింది.

ముకేష్- హిందీ సినీ చిత్ర గీతాల పాలిట దర్దీ సామ్రాట్!

ఏ మాత్రం అనుమానం అక్కర్లేదు.

1931లో వచ్చిన 'ఆలమ్ అరా' హిందీ చిత్రాల తొలి టాకీ. ఆరు పాటలున్న సినిమా అది. ఆ రోజులు స్వయంగా తెర మీద తమ పాటలు తామే పాడుకునే నటీ నటులది. ఆర్.సి. బోరాల్ -పంకజ్ మల్లిక లాంటి వాళ్ళ 'జాదూ' వ్యాపించిన జమాన అది. ఆ బెంగాలీ మిఠాయి సంగీతం వారసత్వం పుణికి పుచ్చుకున్న సంగీత దర్శకుడు అనిల్ బిశ్వాస్.

'దిల్ జల్తా హై తో జల్నేదే' లాంటి బరువైన పాట సంగీతం ఆయనదే! అది 'పహలీ నజర్' సినిమాలోది. పాడింది ముకేష్.

ఆ జమానాలోని మన పాటల దర్దీ శ్రోతలు ఉలిక్కిపడి 'అరే! ఎవరోయ్ పాడిందీ పాటా! ముకేషా? ఆ! అచ్చం సైగల్ తీరు ఉన్నది లే?" అని తెగ 'హాచ్చెర్య' పడి పోయారు.

కుందన్ లాల్ సైగల్ గాత్ర మహిమ అంతటిది. లతా మంగేష్కర్ దగ్గర్నించే కిషోర్ కుమార్, మొహమ్మద్ రఫీ, ముకేష్ అందరూ సైగల్ భక్తులే! ముకేష్ ఎంతటి అనునాసికంగా 'ముక్కు'తో పాడే గాయకుడైనా, స్వంత స్టైల్లో కాకుండా అచ్చం సైగల్‌లా పాడేవాడు తొలి రోజుల్లో.

అంటే మరో మాటలో చెప్పాలంటే 'సేమ్ టు సేమ్ - సైగల్ కాపీ మాస్టర్ అన్నమాట.

"పహలీ నజర్' పాటల రికార్డింగ్ కోసం ఆలస్యంగా వచ్చాడని కోపగించి, అనిల్ బిస్వాస్ ఈడ్చి ముకేష్ చెంప మీద వాయించి కొట్టాడట. అలా కోపం ప్రదర్శించడం ఆనాటి పెద్దోళ్ళ అలవాటు.

తల వంచి ఓర్చుకోవడం అలనాటి శిష్యుల ప్రకృతి కూడా! మాటి మాటికి జేబులోంచి దువ్వెన తీస్తూ తలవెంట్రుకలను షోగ్గా దువ్వుకునే నీలికళ్ళ అందగాడైన 'రాజ్‌కపూర్' లేత గులాబి చెంప మీద ఐదు వేళ్ళూ, అరిచేయీ అంటుకు పోయేలా ఈడ్చి వాయించిన వాడు దర్శక నిర్మాత కేదార్ శర్మ. కిక్కురుమనకుండా తలవంచిన వారు రాజ్‌కపూర్ అంతటి కళాకారులు. అందుకే వారు నిజంగానే మహానీయులై పోయారు.

'ఆయ్!'- 'అరేఁ' అని స్టైల్స్, పోజులు కొట్టి, ఏదో మామూలుగాళ్ళ' బాపతు చరిత్రలో ఉండి పోలేదు. చరిత్రను బంగారు పాళీతో తిరిగి రాయించగలిగిన ఘనత వారిది.

పండిత్ జగన్నాథ ప్రసాద్ అంతటి వారు 'ముకేష్ - సైగల్‌ల గొంతు ఒకటేనండి బాబూ' అన్నంత భారీ కితాబు ఇచ్చిన వారే! కాని,

'ఎవ్వర్నీ కాపీ కొట్టకు. నీ స్వంత స్టైల్లోనే పాడు. నీ ప్రత్యేకత నీది. దాన్ని నిలబెట్టుకో... రాణిస్తావు' అని సలహా ఇచ్చాడు. అనిల్ బిస్వాస్. అందుకే, తర్వాతి రోజుల్లో 'దర్దీ గీతాల బాద్ షా' ఠీవితో వెలిగిపోయాడు ముకేష్.

నౌషాద్ అంతటి హేమాహేమీలైన సంగీత దర్శకులు ముకేష్‌తో దిలీప్‌కుమార్ కోసం పాడించారు.

సలీల్ చౌదరి మధుమతిలో ముకేష్ గొంతులోని అందాలను హుషారు తనంతో నింపి మనకందించారు.

జ్ఞాపకం చేసుకోండి-'మధుమతి'లోని అందమైన గీతాలు!

'దిల్ తడప్ తడప్‌కే కహరహాహై'

'సుహానా సఫర్ ఔర్ ఏ మోసమ్ హసీఁ'

అదే సలీల్ చౌదరి తర్వాతి రోజుల్లో 'ఆనంద్'లో రాజేష్ ఖన్నా కోసం ముకేష్ గొంతునే వాడుకున్నాడు. అప్పటికే రాజేష్ ఖన్నా కోసం

కిషోర్ గొంతు 'ట్రేడ్ మార్క్' అయిపోయినా- ముకేష్ గీతాలు ప్రత్యేకంగా నిలబడ్డాయి. నేటికీ అవి చెక్కుచెదరని ఎవర్ గ్రీన్ బ్యూటీస్!

- 'కహీఁ దూర్ జబ్ దిన్ ఢల్ జాయే చాంద్ సీ దుల్హన్ బదన్ చురాయే'

- 'మైనే తెరే లియేహీ సాత్ రంగ్ కే సప్నే చునే'!

నేటికీ ఆ గీతాలను ఆత్మీయంగా 'గున్ గునాయించే వారు' లక్షల్లో ఉన్నారు మరి!

ముకేష్ ఎన్ని వేల పాటలు పాడినా - పాటలో భావాన్ని తాదాత్మ్యత చెందినట్టు, ఎంతో సులువుగా, నేరుగా మనస్సుకు హత్తుకునేట్టు పాడడం... అది ఆయన 'ఖాసియత్'- 'ప్రత్యేకతగా భావిస్తారు. ముఖ్యంగా కంఠంలోని ఆర్ద్రత, గుండెలోంచి పెగలుకొచ్చిన వ్యధ, బాధ, దుఃఖం - హాల్ మొత్తం మీద ఆయన్ని ఒక అద్భుతమైన 'దర్దీ గీతాల భావుకుడి'గా చరిత్రలో నిలబెట్టాయి.

కొన్నింటిని తలచుకుందాం-రండి!

- జిందా హు ఇస్ తరహ్‌కీ గమే జిందగీ నహీఁ జలతా హువా దియా హుఁ మగర్ రోష్నీ నహీఁ (ఆగ్)

-ఛోడ్ గయే బాలమ్ (బర్సాత్)

మెరేటూటే హుమే రదిల్‌సే (ఛలియా)

-మైతో హర్ మోడ్ పర్ తుఝ్‌కో దూంగా సదా (చేతనా)

- తుమ్ అగర్ ముఝ్ కో న చాహోతో (దిల్ హి తో హై)

వక్త్ కర్తా జో వఫా (దిల్ నే పుకారా)

చాంద్ ఆహేఁ భరేగా (ఫూల్ బనే అంగారే)

లాఖో తారే ఆస్మాన్ పర్ (హరియాలీ ఔర్ రాస్తా)

హమ్ ఛోడ్ చలేఁ హై మెహెఫిల్ కో (జీ చాహ్తా హై)

జిస్ గలీ మే తెరా ఘర్ న హో బాల్ మా (కటీ పతంగ్)

- జీనా యహాఁ మర్నా యహాఁ (మేరా నామ్ జోకర్)

- దోస్త్ దోస్త్ నా రహా (సంగమ్)

లౌట్‌కే ఆజా మేరే మీత్ (రానీ రూపమతి)

ఓ జానెవాలే (బందినీ)

- ఇలా రాస్తూ పోతే పేజీలు సరిపోవు.

'ప్రతి సినిమాలో ఒక ఏడుపు గొట్టు పాట ఉండాలీ... అదీ ముకేష్ పాడాలి... హీరోయిన్ కూడా తల బాదుకొని, ఏడ్చీ ఏడ్చీ, తిరిగి హీరో వైపే పరుగెత్తి వస్తుంది' అనే విశ్వాసం ప్రతీ సినీ పిచ్చోళ్ళ మనస్సులో ఎక్కడో మనస్సులో కుత కుత లాడుతుండేది.

ముకేష్ గొంతుల్లో 'దర్ద్' ఎంతగా కదిలించిరిదో -'ఖుషీ' అంతే 'లావా'లా పొంగి పోయింది. అక్కడక్కడా ఆనాటి 'హాస్య కళాకారుల గొంతులోనూ ముకేష్ ఎంతగా వెలిగి పోయాడో అనే విషయం ఒక పరిశోధనాత్మక వ్యాసం అవుతుంది.

-బోల్ రాధా బోల్ (సంగమ్)

- చాంద్ కో క్యా మాలూమ్
- ఏ మోసమ్ రంగీన్ సమా
- దిల్ ఢూండనే వాలే జాదూగర్
- చాంద్ సి మెహెబూబా హో మేరీ
- హమ్‌తో తెరే ఆషిక్ హై
- ఏ కిస్నే గీతా ఛేడా

ఎవర్ గ్రీన్ 'ఆవారా హుఁ' ఎవరు మరచి పోగల్గుతారనీ? జీవిత తత్వాన్ని బోధించినట్టుగా సాగిన గీతాల నెన్నింటినో ముకేష్ 'నభూతో న భవిష్యత్'లా అందించాడు.

దోసిళ్ళ కొద్దీ అందుకున్న మనమూ కృతార్థులం!

-సబ్ కుఛ్ సీఖా హమ్నే

- హరీ భరీ వసుంధరా హై
- ఛలియా మేరా నామ్
- హోఠోంపే సచ్చాయీ రహ్తీ హై
- చల్ అకేలా
- సజన్ రే ఝూట్ మత్ బోలో

కొన్ని వేల గీతాలు!

ఎన్ని వందల రసరమ్య గీతాలైనా, ఎన్ని వందల హాయి గొలిపే 'నట్‌ఖట్' గీతాలైనా, ఎన్ని వందల ప్రేమ గీతాలైనా ఆఖర్న దర్దీ గీతాల ప్రసక్తి వచ్చినప్పుడు 'ముకేష్'ను తలచుకొని 'సినీ రసికుడు' ఉండడు.

ఒకగాన విభావరి కార్యక్రమంలో అమెరికాలో గుండెనొప్పితో తనువు చాలించిన వార్త విని లక్షల కొద్ది సినీ 'దీవానా'లు కన్నీరు మున్నీరయ్యారు.

'మేరా జూతా హై జాపానీ' అని రాజ్‌కపూర్ కోసం ఎంతో జోష్‌తో పాడాడు ముకేష్.

అంతే 'దర్ద్'తో ' దోస్త్ దోస్త్ నా రహా' (సంగమ్) 'జానే కహాఁ గయే వో దిన్' (మేరా నామ్ జోకర్) పాడాడు.

ఆ తరం తెలియని రసికులు కూడా ముకేష్ పాటలు విని 'ఏందో తమ్మీ! దండిగ ఏడ్పిస్తయి గాయన పాటలు... అనోసరంగా ఒచ్చిన..... మారెండు జడల సీత కోపం వచ్చింది. ఫోన్ల పాట విన్పించిన... వస్తున్నది. ఉరుక్కుంట... టైముంది ట్రేన్‌కు... జల్ది స్టేషన్‌కు పోతా తమ్మీ... మల్ల కలుద్దాం....'

అనే దర్దీ రసికుల మాట 'జోక్'కాదు

అక్షర సత్యాలు!

నమ్మక పోతే-

చీకటి రాత్రిలో డాబా మీద కూర్చుండి మల్లెపూల సుగంధంలో 'లాఖోఁతారే ఆస్మాన్ మేఁ
ఏక్ మగర్ ఢూండే న మిలా
దేఖ్ కే దునియా కే దీవాలీ....
దిల్ మేరా చుప్‌చాప్ జలా' లాంటి గీతాన్ని వినండి లేదా గున్ గునాయించండి!

కంటి చివర్లో మిల మిలా మెరిసే నక్షత్రాలొస్తాయి.

రాకపోతే నాకు చెప్పండి!

నక్షత్రాలు రప్పించే గ్యారంటీ నాది!

❋

**దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.**
**ఫోన్ : 08732223622**






వీరి వీరి గుమ్మడి పండు
**జవాబు**

-------
వీరి వీరి
గుమ్మడి
పండు
వీరి పేరు
అబ్బాస్
-------

# వసూలు చేయడం ఎలా?

మా దగ్గరి బంధువులకు అవసరాల నిమిత్తం 2000 సంవత్సరంలో 15,000/- ఇచ్చాను. 2003లో అతడు వడ్డీ బాపతు 5000/- వేల రూపాయలు ఇచ్చాడు. 2003 నుండి మళ్ళీ ఏం ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వమంటే అతడు ఇవ్వడం లేదు. నేను ఏం చేయాలి?

మోహన్, సికింద్రాబాద్.

చట్ట ప్రకారం మీకు అతడు తిరిగి ఇచ్చిన డబ్బులు చివరి రోజు నుండి మూడు సంవత్సరాలలోపు మీరు కేసు వేయాలి. 2003 నుండి అతడు డబ్బులు చెల్లించకుంటే మీకు లిమిటేషన్ ఆక్ట్ ప్రకారం చట్ట పరంగా ఆసూట్ నెంబర్ కూడా కాదు. అతడు మీకు మళ్ళా డబ్బు ఇచ్చినట్టు కనీసం వంద రూపాయలు ఇచ్చినట్లుగా నైనా రాయించగల్గితే మీరు కోర్టులో కేసు వేయవచ్చు. లేదంటే మీ కేసు లేనట్లే.

# అగ్రిమెంటు చెల్లదా!

నేను ఒక వ్యక్తికి 48,000/- వేల రూపాయలు నగదు ఇచ్చి 1997 సంవత్సరంలో భూమి విక్రయ, అగ్రిమెంటు రాసుకున్నాను. 1998 సంవత్సరంలో అతను చనిపోయాడు. 1999 సంవత్సరంలో నేను, లాయర్ ద్వారా అతని బిడ్డలకు, నోటీస్ ఇచ్చాను. ఇంత వరకు వారు నాకు బదులు జవాబు ఇవ్వలేదు. వారి కుమారుడు మాత్రం భూమి ఇవాళ రాసిస్తా, రేపు రాసిస్తా అని అంటున్నారు. మా బంధువు కాబట్టి అతని మాట నమ్మాను. చివరకు ఇప్పుడు భూమి రాసివ్వనంటున్నారు. దీనితో లాయర్ గారితో మాట్లాడితే మీరు నోటీసు ఇచ్చిన మూడు సంవత్సరాల లోపల మీరు కోర్టులో దావా వేయాలి. ఆ లోపు మీరు దావా వేయలేదు కాబట్టి మీరు రాసుకున్న అగ్రిమెంటు చెల్లదు అంటున్నారు. అగ్రిమెంటు చెల్లకపోతే నష్టపోతాను. నేను రాసుకున్న అగ్రిమెంటు జిరాక్స్ కాపీ, నాకు అగ్రిమెంటు రాసి ఇచ్చిన అతని చనిపోయిన సర్టిఫికెట్లు నేను లాయర్ ద్వారా నోటీసు అర్జీతో జతపరచాను. నాకు తగిన సలహా ఇవ్వగలరు?

వి. షేర్ అలి, రొంపిచెర్ల.

మీరు లిమిటేషన్ ఆక్ట్ చట్ట ప్రకారం ఎటువంటి అగ్రిమెంట్లు గాని, ట్రాంజెక్షన్స్ కాని మూడు సంవత్సరాల వరకే పరిమితమవుతాయి. మీరు 3 సంవత్సరాల లోపు కేసు వేయాలి. మీరు ఆపని చేయలేదు. కనీసం అగ్రిమెంటులో 48 వేలు ఇచ్చారని రాయించుకున్నారు. కాని పొజిషన్ అన్నా మీరు రాసుకుంటే మీకు సపోర్ట్‌గా ఉండేది. ఆ పని కూడా మీరు చేయలేదు. కావున మీకు లీగల్‌గా అప్రోచ్ అయ్యే అవకాశం మీ అంతట మీరే కాలరాసుకున్నారు. కావున మీరు కోర్టుకెళ్ళినా మీకు అనుకూలంగా తీర్పు రాదు.



జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది, 9848994240

# ముదురు



## మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం:9390044031



## తట్టుకోలేకపోతున్నా

నా వయస్సు 20 సంవత్సరాలు. నేను డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. నాకు ఒక అమ్మాయి పరిచయం అయ్యింది. ఆ అమ్మాయికి నేనంటే చాలా ఇష్టం అంది. నేను మా ఇంట్లో గొడవ పెట్టుకొని మా ఇంట్లో వాళ్ళకు దూరంగా వుంటున్నాను. కాని ఇప్పుడు ఆ అమ్మాయికి నేనంటే ఇష్టం లేదని చెబుతోంది. నా చదువు మీద శ్రద్ధ పోయి చదువు కూడా ఆపేశాను. మద్యపానానికి అలవాటయ్యాను. ఇవన్నీ తట్టుకోలేకపోతున్నా. వీటన్నిటినుంచి బయటపడాలి. దయచేసి సలహా ఇవ్వగలరు?

**ఆది, బేగంపేట్.**

ప్రేమ అనేది మనిషిని నాశనం చేసేలా ఉండకూడదు. ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ఉండాలి. ప్రేమ పేరుతో చెడు అలవాట్లకు లోనయ్యి నిన్ను, నీ కుటుంబాన్ని అభాసుపాలు చేసుకోవటం ఎంత వరకు సమంజసం! నీ జీవితాన్ని నీ చేతులారా నాశనం చేసుకుంటున్నావు. మీ కుటుంబీకులు తిట్టినా వాళ్ళతోనే కలిసి ఉండండి. చెడు అలవాట్లు మరీ ఎక్కువగా ఉంటే వెంటనే మీ కుటుంబీకుల సహకారంతో మానసిక వైద్యుల దగ్గరకు వెళ్ళండి. చక్కని ఆలోచనలు పెంపొందించుకోవడానికి, బాగా చదవడానికి కౌన్సిలింగ్ సైకాలజిస్ట్‌ని కలవండి.

## పరీక్షహాల్లో అన్నీ మర్చిపోతున్నా...

నేను ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాను. కాని పరీక్ష హాల్లో పేపర్ చూడగానే అన్ని సమాధానాలు మర్చిపోతాను. బయటకు వచ్చాక మటుకు చక్కగా గుర్తుకు వస్తాయి. దీనికి పరిష్కారం లేదా? నేను ఏమి చేయాలి?

**ఓ విద్యార్థి, బెంగుళూరు.**

పరీక్ష హాల్లో సమాధానాలను గుర్తు తెచ్చుకోలేక పోయిందీ మీ మెదడే. బయటకొచ్చాక వాటిని గుర్తుకు తెచ్చుకున్నదీ మీ మెదడే. అంటే సమాధానాలు మీ మెదడులోనే వున్నాయి. వాటిని గుర్తుకు తెచ్చుకోవడంలో మీ కాన్షస్ మైండ్‌లో ఏర్పడిన కల్లోలం ఒక అవరోధంగా వుండటం వల్ల మీరు వాటిని గుర్తుకు తెచ్చుకోలేక పోయారు.

**ఈ విషయాలను గమనించండి.**

❖ పరీక్షలంటే మీకు సాధ్యంకాని వాటిని రాయమని అడగరు.



❖ సిలబస్‌లో వున్న ప్రశ్నలే అడుగుతారు.

❖ ఏవో కొన్ని ప్రశ్నలను మాత్రమే ఇంపార్టెంటు పేర బట్టీ పట్టకండి.

❖ సిలబస్ మొత్తాన్ని రిఫర్ చేయండి.

❖ పరీక్షహాలుకి అరగంట ముందు వెళ్లండి.

❖ పరీక్షహాల్‌లోకి తీసుకువెళ్ళవలసిన జామెంట్రీ బాక్సులో సామాన్లు ముందుగానే సిద్ధంగా వుంచుకోండి.

## టైమ్‌కి పని చేయలేకపోతున్నా...

నేను ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాను. పని హడావిడిగా, త్వరత్వరగా చెయ్యాలనుకుంటున్నాను. కాని టైమ్‌కి ఏపనీ చెయ్యలేకపోతున్నాను. వాళ్ళు జాబులోంచి తీసేస్తానని అంటున్నారు. నాకు ఏమి తోచడం లేదు. తగిన పరిష్కారం తెలుపగలరు.

**కమల్, ఖమ్మం.**

నెగిటివ్ ఆలోచనలు, ఆందోళన, హడావిడి వల్ల పని అవ్వదు. టైమ్ అయిపోతుంది కాబట్టి మీ సమయాన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకుంటున్నారో లేదో పరిశీలించండి. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేయడం మాత్రమే కాదు. చేయాల్సిన పనులను సందర్భోచితంగా సమయానుకూలంగా పూర్తి చేసుకోండి.

❖ మీ టైమ్, పని పట్ల వ్యక్తిగత అవగాహనను పెంపొందించుకోండి.

❖ ప్రతి రోజునీ ఒక పథకం ప్రకారం గడపండి.

❖ మీ దీర్ఘకాలిక లక్ష్యాలను క్షుణ్ణంగా, స్పష్టంగా తెలుసుకోండి. ప్రణాళికను రాసుకోండి.

❖ అప్పగించిన పనిని సమర్థవంతంగా తెలివిగా చేయండి.

❖ మీ మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోండి.

❖ సెలవు దినం పట్ల అవగాహనను పెంచుకోండి.

❖ అది మీతో ముడి పడి వున్న మీ మనుష్యులకు మీకు గల అనుబంధాన్ని పటిష్టం చేస్తుంది. రేపటి కార్యాచరణకు కావలసిన ప్రేరణను, స్ఫూర్తిని మీకు అందించి మిమ్మల్ని పటిష్టమైన కార్యోన్ముఖులుగా తీర్చి దిద్దుతుంది.

❖ శ్వాస సంబంధ వ్యాయామం, రిలాక్సేషన్ టెక్నిక్స్ చేయండి. ఆందోళన లేకుండా చక్కగా పని చెయ్యగలుగుతారు.

ENTERED

కొత్త పుస్తకాలు

# ప్రపంచీకరణ వికృత రూపానికి చిత్రణ

కవిత్వం అంతటికి కదిలించే స్వభావం ఉండక పోవచ్చు. కానీ కవిత్వం మొత్తంలో ఏ ఒక్క పదానికైనా మనిషిని నిలువరించే స్వభావం తప్పక ఉంటుంది. కొందరి కవిత్వానికి చైతన్యం, ఇంకొందరి కవిత్వానికి కన్నీళ్ళు... ఏదైతేనేం కవిత్వం కదిలించగల్గాలి. మనిషిని మార్పు దిశగా మళ్ళించగల్గాలి. మళ్ళీ ఈ మార్పులో చాలా రకాలున్నాయ్! అది అందరికీ అందుబాటులో ఉండే అభివృద్ధివైపుకు నడిపించగల్గేదై ఉండాలి. అంతేగానీ అభివృద్ధి పేర వున్న సౌధాలకు పేదల రక్తంతో రంగులద్దుతామంటే మనమంతా ఒప్పుకుంటామా? మరీ ముఖ్యంగా మూడు కాలాలు ముందుండే 'కవి' ఒప్పుకుంటాడా? బోజంకి వెంకట రవిలా! "పరాతత్వ పాలకులారా! మూటా ముల్లే సర్దండి" (ఆసన్న సమయం) అనడూ.... ప్రాణమున్న కవి, తన కవిత్వానికి ప్రాణం పోస్తాడు. ఆ క్రమంలో తన వర్గ ప్రయోజనాల్ని, తను నమ్మిన సమానత్వ సిద్ధాంతాన్ని కవిత్వీకరిస్తాడు. అచ్చం వెంకట రవి కూడా తను నమ్మిన బతుకునే అక్షరంగా మలిచాడు. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉద్యోగి. కవిత్వం అతని ప్రవృత్తి. సాహిత్య రంగంలో తనకంటూ కొంత స్థానాన్ని పదిల పర్చుకోగల కవిత్వాన్ని సృష్టించాడు. అంతలో కొంతని "మనోముద్ర"గా పాఠకులకందించారు.

నేడు మృగ్యమ వుతున్న మానవ సంబంధాలపై కవి అమాయకంగా భవిష్యత్ గురించిన ఆందోళన ప్రకటిస్తాడు. అంతటితో ఆగక '....ఆ మాయల ఫకీరు ప్రాణాలు / పులిరాజాలో వున్నాయి/ పంచెవన్నెల చిలకలలోనూ వున్నాయి/ అంటాడు దీనికి వివేక గవాక్షాలు తెరుచుకోవాలంటూ కర్తవ్యాన్ని సూచిస్తాడు (పేజీ-20) దాడికి ప్రతి దాడి అనేది అందరికీ తెలిసిందే కానీ దాడికి సంయమనం పాటించడం కొందరికి తెలిసిందే. ఒక్కోసారి సంయమనం పాటించక అమాయకుల ప్రాణాలు బలవుతుంటాయి. అందుకే

"ఆ ప్రపంచ
పోలీసోడి దాడికి ప్రతిగా
మనమిప్పుడు 'ఆత్మ సంయమం'
ఆయుధం చేసుకుందాం'

అనడం. 'శాంతి' అంతిమ పరిష్కారంగా చూపిస్తున్నాడు కవి. స్పర్శలేని జీవితాన్ని భారంగా మోస్తున్న నేటి గ్లోబల్ యుగంలో 'ఉరుకుల పరుగులు' అత్యంత సహజమైంది. విచ్చలవిడిగా సంపాదనకు అలవాటు పడ్డ కొందరి కోసం ఓ కొత్త సంస్కృతి అవసరమైంది.

''వోజులు
మితిమీరి
లెబ్బుల్లో పబ్బులో నైటుక్లబ్బుల్లో
మందూ పొంద్లై విందై
మహమ్మార్ల ముందు మోకరిల్లాయి.
సంస్కృతికి కుష్టు సోకి
మానవ అనుభూతి స్పర్శకి
దొరక్కుండా పోయింది!

నిజంగా మనల్ని మనం స్పర్శించుకోని వింత జీవితాల్ని అనుభవిస్తున్నాం. మనకు తెల్వకుండానే అగాధంలోకి నెట్టివేయబడటం గ్లోబలైజేషన్ వచ్చిన ఒకానొక గొప్ప మార్పు. అందుకే కవి దీన్ని వ్యతిరేకిస్తూ గొంతు విప్పాడు. స్వరం కల్పడాన్ని అందర్నీ ఆహ్వానిస్తూ జీవితంలోని విషాదాల్ని, వాటి మూలాల్ని విప్పి చెప్పిన కవిత్వాన్ని అందించిన బోజంకి వెంకటరవి మరింత పదునుగా సాహిత్య సృష్టి చేస్తాడన్న భరోసా ఈ 'మనోముద్ర' కవితా సంకలనం.

**మనోముద్ర-**
**బోజంకి వెంకటరవి**
**తేజస్విని సాహితీ సమితి ప్రచురణ**
**వెల:60**
**ప్రతులకు:**
**అన్ని ప్రముఖ షాపులు.**

**సైదులు ఐనాల**

# మరో 'అక్షర వసంతం' కురిపించిన
## మినీ కవితలు

అక్షరం ఇచ్చే ఐశ్వర్యాన్ని వెల కట్టలేము. కృత్రిమ అందాలన్నీ తెల్లని జాబిల్లి ముందు దిగదుడుపే గదా? ఇదే విషయాన్ని ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి "అక్షరం ఇచ్చిన ఐశ్వర్యం / అవార్డులకు అతీతం / అమనిలో పూచిన అక్షరాలు / వసంత కోకిల సుస్వరాలు" అన్న మినీ కవితలో ఇమిడ్చారు. జీవితగమనంలో తనకు ఎదురైన అనేక సంఘటనలకు అక్షర రూపం ఇచ్చారు.

"ప్రగతి పథంలో ముందున్నాం!
పురుగు మందు తిన్న రైతు
కళ్ళ ముందున్నాడు".

చెంపపై చెళ్ళున కొట్టినట్లు పాలకులు చెప్తున్న "ప్రగతి చక్రాల పయనం" ఎవర్ని ఉద్ధరిస్తుంది! అని ప్రశ్నిస్తుంది. నిత్యం న్యూస్ పేపర్లలో వచ్చే వార్తల్ని చూసీ చూడనట్లు వదిలేస్తుంటాం. కానీ ఎంతో సున్నిత మనస్కులైన రచయిత్రి ఆ సంఘటనలకు చలించి పోతారు. జరిగిన అన్యాయాన్ని తనదైన శైలిలో ప్రశ్నిస్తారు. ఈ ప్రశ్నలకు వెయ్యేనుగుల బలముంటుంది. కోట్ల మెదళ్లను కదిలిస్తుంది. "ఆసుపత్రులు / నిరుపేదలకు నిశ్శబ్ద శ్మశానవాటికలు" అనడం వెనుక ప్రభుత్వం వైద్యాన్ని కార్పొరేటీకరిస్తున్న క్రమంలో పేదల జీవితాల్లోని విషాదం ఉంది. నేటి సమాజంలోనున్న అనేక రుగ్మతలకు కారణం స్వార్థమే. ఇది మనిషిని ఎంత నీచానికైనా దిగజార్చుతుంది. "అర్హులకు పదవుల్లేవు/ అనర్హులకు అవకాశాలూ లావు" అంటూ నేటి అధికారుల, రాజకీయ నాయకుల బంధుప్రీతిని, స్వార్థాన్ని నగ్నంగా, సూటిగా చెప్పారు.

నిరంతరం అక్షర వ్యవసాయం చేస్తున్న ఎస్. శరత్ జ్యోత్స్నారాణి 'జ్యోత్స్న కళాపీఠం' తరుపున అనేక సాహిత్య కార్యక్రమాల్ని నిర్వహిస్తూ సాహిత్య సేవ చేయడం అభినందించదగ్గ విషయం. నీకూ- నాకు నడుమ 'కథలు పాఠకుల మెదళ్ళలో నుండి చెదిరిపోక ముందే 'అక్షర వసంతం' కురిపించిన శరత్ జ్యోత్స్నా రాణి నేటి యువ కవయిత్రులకు స్ఫూర్తి. అమ్మతనాన్ని మూర్తీభవించిన అక్షరాల్ని చెక్కడంలో అందనంత ఎత్తుకెదిగిన శరత్ జ్యోత్స్న మరింత అక్షర వ్యవసాయం చేస్తారని ఆశిస్తూ.

**అక్షర వసంతం (మినీ కవితలు)**
**ఆచార్య ఎస్. శరత్జ్యోత్స్నారాణి**
**జ్యోత్స్న కళాపీఠం ప్రచురణలు**
**వెల: 80**
**ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక షాపులు.**

**ఐనాల**




### అమ్మానాన్నలు

(రుద్రంగి రమేష్ నానీలు)

వెల:40/-, పేజీలు:88
ప్రతులకు:
విశాలాంధ్ర, దిశ, నవోదయ అన్ని పుస్తక షాపులలో దొరుకును
భూపతి నివాసం, శ్రీకృష్ణ పబ్లిక్ స్కూల్ ఎదురుగా, రహ్మత్‌బాగ్, కాచిగూడ,
హైదరాబాద్.




### యథేచ్ఛసి తథాకురు

(నీకు ధర్మం అనిపించిందే ఆచరించు)
డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి
వెల:100/-, పేజీలు: 278
ప్రతులకు:
డా॥ టి. హెచ్ చౌదరి
సెంటర్ ఫర్ టెలికం
మేనేజ్‌మెంట & స్టడీస్, పి&టి కాలనీ,
సికింద్రాబాద్.





# జుట్టున్నమ్మ...

జంతువుల ఆకారాల్లో వున్న కొప్పలను చూస్తుంటే ఓ సామెత గుర్తుకు రావాలి. కాస్త పాతదే అయినా బాగా పాపులర్ సామెతలెండి. ఏంటి ఇంకా గుర్తు రాలేదా! అదేనండీ... 'జుట్టు వున్నమ్మ ఏ కొప్ప పెట్టినా అందమే' అన్న సామెత. సరే ఆ విషయం వదిలేద్దాం. ఇంతకీ విదేశీ అమ్మాయిలయినా భలే వెరైటీగా కొప్పలు అలంకరించుకున్నారు కదూ. ఏకంగా ఖడ్గమృగం, కుందేలు, ఏనుగు, జిరాఫీ, మేక, నక్క, కుక్క వచ్చి వారి నెత్తిమీద తిష్ట వేసినట్టు అనిపిస్తోంది మరి...



# అవ్వ సంచి

**చూటీ**

ఆ అవ్వ పేరేంటోగానీ అందరూ ఆమెను అవ్వ అనే పిలిచేవారు. ముగ్గుబుట్టలాంటి తల...వంగిపోయిన నడుము... బోసినోరు...రేగు పండులా ముడతలు పడిన చర్మం...ప్రేమను వర్షించే కళ్లు... ఆమెను చూస్తే మన ఇంట్లో అవ్వను చూచిన భావన కలిగేది ఎవరికైనా. అవ్వకు నా అన్నవాళ్లు ఎవ్వరూ లేరు. ఓసారి ఎందుకో ఆమెకు పుణ్యక్షేత్రాలు తిరిగి చూచి రావాలనిపించింది. అందుకోసం అన్ని ఏర్పా[illegible]కుంది. తన దగ్గర వున్న బంగారు నాణేలను ఒక సంచిలో వేసి జాగ్రత్తగా కుట్టేసింది. ఆ సంచి తీసుకొని తన ఇంటి పక్కనే వుండే ఓ ధనవంతుడిని కలిసింది.

"అయ్యా! మీరు నేను అనేక సంవత్సరాలుగా ఒకే చోట నివసిస్తున్నాం. మీరేంటో నాకు తెలుసు. అందుకే మీ దగ్గరకు వచ్చాను. నేను పుణ్యక్షేత్రాలకు వెళుతున్నాను. అప్పటి వరకు ఈ సంచిని మీరు భద్రంగా వుంచగలరా?! అయితే ఒక ముఖ్యమైన విషయం ఏంటంటే... నేను రెండేళ్లలోపు పుణ్యక్షేత్రాల నుంచి తిరిగి వస్తే ఈ సంచిని తీసుకుంటాను. ఒకవేళ ఆ లోపు రాకపోతే అంటే రెండేళ్లు పూర్తవగానే మీరు ఆ సంచి తీసుకొని అందులో వున్న వాటిని పేదలకు దానం చేయవచ్చు. మీకు సమ్మతమేనా!" అని అడిగింది.

దానికి అతను కాసేపు ఆలోచించి..."సరే. నీ ఇష్టం అవ్వా. అదిగో ఆ గదిలో ఏదో ఒక మూలన గొయ్యి తీసి నీ సంచిని పూడ్చిపెట్టుకో. మళ్లీ నువ్వు తిరిగి వచ్చాక తీసుకుందువుగాని" అనేసి అక్కడినుంచి వెళ్లిపోయాడు.

అవ్వ సంతోషంగా ఆ గదిలో ఒక మూలన గొయ్యి తీసి బంగారునాణేల సంచిని పూడ్చి పెట్టి తనకు మాత్రమే తెలిసేలా ఒక గుర్తు కూడా పెట్టుకుంది. తర్వాత అతనికి ధన్యవాదాలు చెప్పకుని వెళ్లిపోయింది.

❖ ❖ ❖

చూస్తుండగానే సంవత్సరం గడిచిపోయింది. తర్వాత ఆరు నెలలు గిర్రున తిరిగాయి. తన పర్యటన ముగించుకున్న అవ్వ ఓ రోజు రానే వచ్చింది. ఆ ధనికుడి ఇంటికి వెళ్లింది. అతను అవ్వను చూచి చాలా సంతోషించి...

"ఏం అవ్వా! పుణ్యక్షేత్రాలన్నీ బాగా చూశావా?! ఎక్కడా ఏవిధమైన ఇబ్బందీ కలగలేదుకదా..." అనడిగాడు.

"అవును బాబూ. అంతా బాగానే జరిగింది. నేను పుణ్యక్షేత్రాలకు వెళ్లబోయేముందు ఒక సంచి దాచిపెట్టానుకదా. అది తీసుకెళదామని వచ్చాను.. అన్నట్టు మర్చేపోయాను. ఇదిగో నాయనా. ఈ ప్రసాదం తీసుకో..." అంటూ చిన్న పొట్లాం ఇచ్చింది.

ధనికుడు దానిని తీసుకొని..."అవును అవ్వా. నువ్వు ఆ గదిలో నీ సంచిని దాచిపెట్టుకున్నావు. వెళ్లి తీస్కో..." అంటూ గదిని చూపించాడు.

అవ్వ రహస్యంగా తను పెట్టుకున్న గుర్తు కోసం వెతికింది. అది కనిపించాక తన సంచిని తవ్వి తీసుకుంది. తన సొమ్మును జాగ్రత్తగా అంతకాలం కాపాడినందుకు ధనికుడికి ధన్యవాదాలు చెప్పకుని సంతోషంగా ఇంటికి వెళ్లింది. సంచిని తెరిచి చూచింది. ఆశ్చర్యం అందులో బంగారు నాణేలకు బదులుగా రాగి నాణేలు వున్నాయి. వాటిని చూచి అవ్వ బావురుమంది. తను జీవితాంతం కష్టపడి సంపాదించినదంతా బంగారు నాణేల రూపంలో సంచిలో దాచిపెట్టుకుంది. ఇప్పుడవి రాగి నాణేలు అయ్యాయి. ఈ చివరి దశలో తనకు దిక్కెవరు? అంటూ భోరున ఏడ్చింది. అది విన్న ఇరుగుపొరుగు ఒక సలహా ఇచ్చారు. వెళ్లి బీర్బల్‌ను కలవమన్నారు. ఆమె వారు చెప్పినట్టే చేసింది. బీర్బల్‌కు తన కథంతా చెప్పకుంది. బీర్బల్ ఆమెను రెండు రోజుల తర్వాత రమ్మని చెప్పి పంపేశాడు.

అయితే అదే రోజు రాత్రి బీర్బల్ రహస్యంగా ధనికుడి ఇంట్లోకి ప్రవేశించి అతని మంచంమీద వేసిన దుప్పటిని కత్తెరతో కత్తిరించి వెళ్లిపోయాడు. మరునాటి ఉదయం పక్క సర్దుతున్న పనివాడు ధనికుడి దుప్పటి చిరిగి వుండడాన్ని గమనించి

"అమ్మో! అయ్యగారి దుప్పటి చిరిగింది. అదిగానీ ఆయన చూశాడంటే చంపేస్తాడు. వెంటనే కుట్టించాలి" అనుకుని రహస్యంగా దాన్ని ఒక దర్జీ దగ్గరకు తీసుకెళ్లి ఇచ్చాడు. అతను దాన్ని తన పనితనమంతా చూపించి జాగ్రత్తగా కుట్టేశాడు. దుప్పటి ఇలా పట్టుకుని చూస్తే అసలు ఎక్కడ చిరిగిందో ఎక్కడ కుట్టాడో కూడా తెలియనంత జాగ్రత్తగా కుట్టాడు. పనివాడు దాన్ని తీసుకొని పక్కమీద వేసేశాడు. అదే రోజు రాత్రి బీర్బల్ మళ్లీ ధనికుడి ఇంట్లోకి ప్రవేశించి దుప్పటి నాలుగు వైపులా పరిశీలించి చూశాడు. ఎక్కడా చిరిగిన చిహ్నంగానీ, కుట్టిన దాఖలాలు కానీ కనిపించలా. అంతే ఆయన మొహం వికసించింది. మూడవ రోజు ఉదయాన్నే ధనికుడి ఇంట్లో పనిచేసే పనివాడిని దర్బారుకు పిలిపించి రహస్యంగా ఆ దుప్పటిని ఎవరి దగ్గర కుట్టించిందీ చెప్పమన్నాడు. అతను వణికిపోతూ విషయం చెప్పాడు. ఆనక అతగాణ్ణి పంపేసి దర్జీని పిలిపించాడు. అతను రాగానే అవ్వ సంచిని చూపించి

"ఇదిగో ఈ సంచిని జాగ్రత్తగా పరిశీలనగా చూడు. దీన్ని నువ్వు గతంలో ఎప్పుడైనా చూశావా?" అనడిగాడు.

అతను దాన్ని నాలుగువైపులా తిప్పి చూచి "అవును ప్రభూ! దీన్ని దాదాపు సంవత్సరంన్నర క్రితం కుట్టాను. కాకపోతే ఆ కుట్టు ఎక్కడా కనిపించని రీతిలో కుట్టాను...ఓ ధనికుడు దీనిని నా దగ్గరకు తీసుకొచ్చాడు. ఏం ప్రభూ...ఏదైనా సమస్యా?" అనడిగాడు.

"మరైతే నువ్వు ఆ సంచిని కుట్టినప్పుడు అందులో ఏం వున్నాయి?"

"రాగి నాణేలు వున్నాయి ప్రభూ"

"సరే. నువ్వు లోపల కూర్చో...." అన్నాడు బీర్బల్.

వెంటనే ధనికుడిని పిలిపించి 'అవ్వ సంచిలో బంగారు నాణేలు ఏం చేశావ్?' అనడిగాడు.

"ఏం నాణేలు...ఏం బంగారం...నాకేం తెలుసు?" అన్నాడు తడబడుతూ...

అప్పుడు బీర్బల్ లోపల గదిలో కూర్చున్న దర్జీని పిలిపించాడు. అతణ్ణి చూడగానే ధనికుడు వణికిపోతూ..."నన్ను క్షమించండి బీర్బల్‌గారూ. నేనే బుద్ధి గడ్డి తిని అవ్వ బంగారు నాణేలు కాజేసి రాగి నాణేలు వుంచాను. ఆ విషయం తెలియకుండా వుండడానికి అతనితో కుట్టించాను. అనుమతిస్తే ఇప్పుడే ఇచ్చేస్తాను" అంటూ బీర్బల్ కాళ్లమీద పడ్డాడు.

బీర్బల్ అనుమతితో ఇంటికెళ్లి బంగారునాణేలు తెచ్చి అవ్వకు ఇచ్చాడు. అవ్వ సంతోషంగా బీర్బల్‌కు నమస్కరించి నాణేలు తీసుకొని వెళ్లిపోయింది.